రా.. కదలిరా సభకు చురుగ్గా ఏర్పాట్లు

పరిశీలించిన టీడీపీ నాయకులు



గొండుపాలెంలో హెలీ ప్యాడ్‌ను పరిశీస్తున్న టీడీపీ నాయకులు

అనకాపల్లి/కె.కోటపాడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మాడుగుల నియోజకవర్గం కె.కోటపాడు మండలం గొండుపాలెంలో ఈ నెల 5న జరిగే రా.. కదలిరా సభకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పాల్గొనే ఈ సభను విజయవంతం చేయడానికి పార్టీ నాయకులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. సుమారు 15 ఎకరాల స్థలంలో సభా వేదిక, బారికేడ్లు, సమీపంలో హెలీ ప్యాడ్ నిర్మిస్తున్నారు. ఈ ఏర్పాట్లను పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, మాజీ మంత్రి బండారు సత్యనారాణమూర్తి తదితరులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా బుద్ద నాగ జగదీశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ సోమవారం ఉదయం 11 గంటలకు చంద్రబాబు హెలికాప్టర్‌లో గొండుపాలెం సభా ప్రాంగణానికి చేరుకుంటారని తెలిపారు. ఉదయం 10 గంటల్లోగా జిల్లా నలుమూలల నుంచి ప్రజలు సభ వద్దకు చేరుకొనేలా ఇన్‌చార్జులు, మండల, గ్రామ నాయకులు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్సీ చిరంజీవిరావు మాట్లాడుతూ సభ ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయని, ఉదయం 11 గంటలకు సభ ప్రారంభమై మధ్యాహ్నానికి ముగుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు గవిరెడ్డి రామానాయుడు, కేఎస్ఎన్ రాజు, చోడవరం ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు, జనసేన పార్టీ కె.కోటపాడు మండల అధ్యక్షుడు సంతోశ్, సభ నిర్వహణ పరిశీలకుడు కిమిడి నాగార్జున, కర్రోతు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటన ఖరారు

విశాఖపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం గొండుపాలెంలో ఈ నెల ఐదో తేదీన జరిగే రా .. కదలిరా సభకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు హాజరయ్యే పర్యటన షెడ్యూల్ ఖరారైంది. సోమవారం ఉదయం 10 గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి చంద్రబాబు హెలికాప్టర్‌లో బయలుదేరి 11.20 గంటలకు గొండుపాలెం చేరుకుంటారు. అక్కడ నుంచి 11.30 గంటలకు సభా వేదికకు చేరుకుని మధ్యాహ్నం ఒంటి గంట వరకు సభలో పాల్గొంటారు. సభ ముగిసిన తరువాత తిరిగి 1.40 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకుని 1.45 గంటలకు ఏలూరు జిల్లా చింతలపూడి మండలంలో నిర్వహించే సభలో పాల్గొనేందుకు వెళతారు.

ఉలిక్కిపడిన విశాఖ

కలకలం రేపిన తహసీల్దార్ హత్యోదంతం

- కారణాలపై రకరకాల ప్రచారం
- విశాఖలోని భూమికి కన్వేయన్స్ డీడ్ జారీ వ్యవహారమే కారణమని సీపీ వెల్లడి
- విజయనగరం జిల్లాలోని భూ వివాదం కారణమంటున్న రమణయ్య సోదరుడు
- తెరపైకి ప్రసాద్ అనే వ్యక్తి పేరు



తహసీల్దార్ సనపల రమణయ్య (ఫైల్ ఫొటో)



నిందితుడు



విచార వదనంలో కుమారుడు కృష్ణ రంగతో తహసీల్దార్ సతీమణి అనూష

విశాఖపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి):

నగరంలో కలకలం రేపిన తహసీల్దార్ సనపల రమణయ్య హత్యకు కారణం ఏమిటనే దానిపై తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది. ఇందుకు సంబంధించి రకరకాల ప్రచారం జరుగుతోంది. నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి రూరల్ తహసీల్దార్ కార్యాలయం పరిధిలోని భూమికి సంబంధించిన కన్వేయన్స్ డీడ్ జారీ అంశమే హత్యకు కారణమని స్పష్టంగా చెప్పారు. రూరల్ తహసీల్దార్ కార్యాలయం పరిధిలోని కొంత భూమిలో రియల్టర్ ఒకరు భవన నిర్మాణాలు చేశారని, వాటిని విక్రయించాలంటే కన్వేయన్స్ డీడ్ తప్పనిసరి కావడంతో తహసీల్దార్‌పై గత కొద్దిరోజులుగా ఒత్తిడి తెస్తున్నారన్నారు. రియల్టర్ అప్పటికే రూ.5-6 కోట్లు అప్పుల్లో ఉండడం, భవనం కూడా బ్యాంకుకు మార్టిగేజ్ చేసి ఉండడంతో తహసీల్దార్ చుట్టూ తిరుగుతున్నాడని, ఈ క్రమంలోనే హత్యకు పాల్పడి ఉంటాడని సీపీ వెల్లడించారు.

అయితే రమణయ్యకు వరుసకు సోదరుడిగా చెబుతున్న రాజేంద్ర అనే వ్యక్తి మీడియాతో మాట్లాడుతూ తమకు విజయనగరం జిల్లా చీపురుపల్లి సమీపంలోని బొండపల్లి వద్ద మూడు ఎకరాల భూమి ఉందని, దానికి ఆనుకునే మధురవాడ ప్రాంతానికి చెందిన గంగారాం ప్రసాద్‌కు నాలుగు ఎకరాలు భూమి ఉందని చెబుతున్నారు. తాము వేరొకరికి రూ.1.8 కోట్లు బాకీ ఉండగా, వారి తరపున ప్రసాద్ వకల్తా పుచ్చుకుని ఎంవీపీ కాలనీలో తాను ఉంటున్న ఫ్లాట్‌ను ఖాళీ చేయాలని బెదిరించడంతో రెండు నెలల కిందటే ఎంవీపీ కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశానని వెల్లడించారు. తాజాగా శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ప్రసాద్ బొండపల్లిలోని తమ భూమి వద్దకు వెళ్లి వాచ్‌మన్ ప్రకాష్ సెల్ నుంచి తనకు ఫోన్ చేసి భూమిలోకి వస్తే సాయంత్రం నాలుగు గంటలయ్యేసరికి చంపేస్తానని బెదిరించాడని ఆరోపించారు. తనను చంపేస్తాడేమోనని భయంతో తాను దాక్కొంటే తన సోదరుడైన రమణయ్యను చంపేశాడని, అలా జరుగుతుందని ఊహించలేదని అంటున్నాడు. దీంతో రమణయ్య హత్యకు కారణం ఏమిటనే దానిపై స్పష్టత ... మిగతా 7వ పేజీలో

పోలీసుల కళ్లుగప్పి బెంగళూరుకు నిందితుడు - 7లో

చెలరేగిన బుమ్రా

- తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 253 ఆలౌట్
- బుమ్రాకు 6 వికెట్లు, కుల్దీప్ యాదవ్‌కు 3
- భారత్‌కు 143 పరుగుల ఆధిక్యం
- అంతకుముందు డబుల్ సెంచరీ చేసిన జైస్వాల్
- కేరింతలతో భారత్ ఆటగాళ్లను ఉత్సాహపరిచిన ప్రేక్షకులు



వికెట్ తీసిన ఆనందంలో బుమ్రా

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 3:



డబుల్ సెంచరీ చేసిన ఆనందంలో జైస్వాల్

ఇంగ్లండ్‌తో స్థానిక పీఎం పాలెం స్టేడియంలో జరుగుతున్న టెస్ట్ మ్యాచ్‌లో భారత్ పట్టు బిగిస్తోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 171 పరుగులు ఆధిక్యంతో ఉంది. తొలిరోజు 176 పరుగులతో అజేయంగా ఉన్న భారత్ ఓపెనర్ యశస్వి జైస్వాల్ రెండో రోజు శనివారం డబుల్ సెంచరీ పూర్తి చేయడంతో స్టేడియం అభిమానుల కరతాళ ధ్వనులతో హోరెత్తింది.

మ్యాచ్‌లో శుక్రవారం తొలిరోజు ఆట ముగిసే సమయానికి ఆరు వికెట్లు కోల్పోయి 336 పరుగులు చేసిన భారత్ జట్టు..రెండో రోజు ఇన్నింగ్స్ ప్రారంభించిన కొద్దిసేపటికే అశ్విన్ (20) వికెట్‌ను కోల్పోయింది. ఇక 179 పరుగుల వ్యక్తిగత స్కోరుతో బ్యాటింగ్ కొనసాగించిన యశస్వి..ఇన్నింగ్స్ 101.2 ఓవర్‌లో బషీర్ వేసిన బంతిని స్క్వేర్ లెగ్ మీదుగా సిక్సర్ బాదాడు. ఆ తర్వాత బంతిని స్క్వేర్ లెగ్ మీదుగా బౌండరీకి తరలించి డబుల్ సెంచరీ పూర్తిచేశాడు. తొలి డబుల్ సెంచరీ చేసిన జైస్వాల్ ముందుగా స్టాండ్స్‌లోని ప్రేక్షకులకు అభివాదం చేసి..తర్వాత భారత్ శిబిరం వైపు తిరిగి ఆనందాన్ని వ్యక్తం చేశాడు. 277 బంతుల్లో 18 బౌండరీలు, ఏడు సిక్సర్లతో డబుల్ సెంచరీ పూర్తిచేసిన యశస్వి (209) మరో తొమ్మిది పరుగులు జోడించిన అనంతరం అండర్సన్ బౌలింగ్‌లో షాట్‌కు యత్నించి డీప్ కవర్‌లో స్టోవ్ క్యాచ్ పట్టడంతో ఎనిమిదో వికెట్‌గా పెవిలియన్‌కు ... మిగతా 7వ పేజీలో

అక్రమ నిర్మాణానికి అడ్డే లేదు

దర్జాగా నర్సీపట్నం క్లబ్ ఆవరణలో కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ పనులు

- అనుమతులు లేకుండా నిర్మాణం
- పట్టించుకోని రెవెన్యూ, మునిసిపల్ అధికారులు
- రాజకీయ నాయకుల అండదండలే కారణమని ఆరోపణలు



సిటీ క్లబ్ ఆవరణలో తెరమాటున షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం జరుగుతున్న దృశ్యం

నర్సీపట్నం, ఫిబ్రవరి 3:

రాజకీయ నాయకులు, అధికారుల అండదండలతో నర్సీపట్నం నడిబొడ్డున దర్జాగా అక్రమ నిర్మాణం సాగుతోందన్న విమర్శలున్నాయి. సిటీ క్లబ్ ఆవరణలో జరుగుతున్న కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి మునిసిపాలిటీ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అనుమతులు లేవని తెలిసింది. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.



గత ఏడాది నిర్మించిన దుకాణాలు

తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా, పంచాయతీరాజ్ కార్యాలయాన్ని ఆనుకొని ఉన్న నర్సీపట్నం క్లబ్ గ్రామ కంఠం సర్వే నంబరు 357/3లో ఉంది. పాత బిల్డింగ్, ఖాళీ స్థలంతో కలిసి 55 సెంట్ల స్థలంలో ఈ క్లబ్ ఉంది. పూర్వం గ్రామ పెద్దలు, అధికారులు రిక్రియేషన్ క్లబ్ ఏర్పాటు చేశారు. బాల్ బ్యాడ్మింటన్, షటిల్, టెన్నిస్ వంటి ఆటలు ఆడుకునే వారు. దానినే నర్సీపట్నం క్లబ్‌గా, సిటీ క్లబ్‌గా పిలుస్తుంటారు. వాస్తవానికి ఈ స్థలంలో కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టకూడదు. 2022 సంవత్సరంలో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా రెండు అంతస్థుల షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. ఆ షాపులన్నీ అద్దెకు ఇచ్చారు. తాజాగా ఆ షాపులను ఆనుకొని మరో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం గత నెల రోజుల నుంచి వేగంగా జరుగుతోంది. శనివారం క్లబ్ ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించి శ్లాబ్ కాంక్రీట్ పనులు జరిగాయి. మునిసిపాలిటీ ప్లాన్ అనుమతి లేకుండా రూ.కోట్లు విలువ చేసే గ్రామ కంఠం స్థలంలో అక్రమ నిర్మాణం జరుగుతున్నా అధికారులు కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు. స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ చూసీచూడనట్టు ఉండమని టౌన్ ప్లానింగ్ అధికారికి చెప్పినట్టు ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యే చెప్పడంతో అధికారులు ఎవరూ అటువైపు చూడడం లేదని తెలిసింది. దీనిపై టౌన్ ప్లానింగ్ అధికారి వెంకటేశ్వరరావును వివరణ కోరగా గత ఏడాది నర్సీపట్నం సిటీ క్లబ్ ఆవరణలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌కు టౌన్ ప్లానింగ్ అనుమతి లేదన్నారు. ఆ భవనం మీద కోర్టులో కేసు వేశామని చెప్పారు. ఇప్పుడు నిర్మాణం జరుగుతున్న భవనానికి కూడా అనుమతులు లేవని తెలిపారు. పునాదుల స్థాయిలోనే ఆపమని చెప్పామని, అయితే పనులు ఆపలేదని చెప్పారు.

బీఎన్ రోడ్డు ఎప్పటికి పూర్తయ్యేనో ?

బిట్లు బిట్లుగా పనులు

- బిల్లులు మంజూరుకాక పనులు నిలిపివేసిన కాంట్రాక్టరు
- అధ్వాన రోడ్డుతో వాహనచోదకులకు తప్పని అవస్థలు



రావికమతం మండలం గర్నికం వద్ద అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి

చోడవరం, ఫిబ్రవరి 3:

గ్రామీణ జిల్లాలో ఇటు చోడవరం, అటు మాడుగుల నియోజకవర్గాల పరిధిలో ఎన్‌డీబీ(న్యూడెవలప్‌మెంట్ బ్యాంక్) నిధులతో చేపట్టిన బీఎన్ రోడ్డు పనులు ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. మరికొద్ది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని భావిస్తున్న ఈ తరుణంలో ఈ రహదారి పనులు పూర్తయ్యేది ఇక అనుమానమేనన్న ప్రచారం జరుగుతున్నది.



చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ప్రధాన రహదారి (ఫైల్)

జిల్లాలో ఎన్‌డీబీ నిధులతో చేపట్టిన పనుల్లో చోడవరం నియోజకవర్గంలో ప్రధానంగా చోడవరం మండలంలోని వెంకన్నపాలెం నుంచి చోడవరం వయా వడ్డాది మీదుగా రోలుగుంట వరకు 48 కిలో మీటర్ల రోడ్డుతో పాటు, వడ్డాది జంక్షన్ నుంచి ఎం.కోటపాడు మీదుగా మాడుగుల నియోజకవర్గం తాటిపర్తి వరకు గల 14 కిలోమీటర్ల మేర రహదారి అభివృద్ధికి రూ.125 కోట్లతో టెండర్లు పిలిచారు. ఇందులో ప్రధానంగా చోడవరం నియోజకవర్గంలోని గంధవరం నుంచి రోలుగుంట వరకు గల రహదారి రూ.113 కోట్లతో అభివృద్ధి చేయాల్సి ఉంది. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో ఈ పనులకు టెండర్లు పిలవడం, ఆపై రివర్స్ టెండర్ల ప్రక్రియతో రహదారి పనులకు ఆదిలోనే జాప్యం జరిగింది. ఆ తరువాత కొంతకాలం కొవిడ్ కారణంగా పనులు ప్రారంభం కాలేదు. ఎన్‌డీబీ నిధులకు రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద చెల్లించవలసిన మార్జిన్ మనీ నిధులు విడుదల చేయకపోవడంతో మరికొంతకాలం ఈ పనులు నిలిచిపోయాయి. చివరకు 2021లో ఈ పనులను కాంట్రాక్టరుకు అప్పగించారు. అయితే లెవిలింగ్ పనులు అంటూ మరికొన్ని రోజులు సాగదీశారు. ఈ లోగా రహదారి పరిస్థితి దుర్భరంగా మారడం, అన్ని వర్గాల నుంచి రహదారి పరిస్థితిపై విమర్శలు చెలరేగడంతో ఎట్టకేలకు గత ఏడాది ఫిబ్రవరిలో రావికమతంతో పాటు, చోడవరం పరిధిలో అక్కడక్కడ కొద్దిపాటి పనులు ప్రారంభించారు. రావికమతం సమీపంలో కొంత మేర పనులు చేపట్టిన కాంట్రాక్టరుకు రావలసిన సుమారు రూ.70 లక్షల మేర బిల్లులు విడుదల కాకపోవడంతో పనులు నిలిపివేశారు. పనుల జాప్యంపై స్థానిక ఎమ్మెల్యే ధర్మశ్రీ ఆందోళనకు కూడా సిద్ధమైన సంగతి తెలిసిందే. కాగా గతంలో చోడవరం వచ్చిన వైసీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి గత ఏడాది డిసెంబరు నాటికి రోడ్డు పనులు పూర్తి చేస్తామని, చేయలేని పక్షంలో కాంట్రాక్టరును మార్చేసి అయినా పనులు పూర్తి చేస్తామంటూ ఆర్భాటంగా ప్రకటించారు. దీంతో చోడవరం పట్టణ పరిధిలో నాలుగైదు పాయింట్లలో సిమెంట్ కాంక్రీటు వేసి, ఆ తరువాత మళ్లీ పనులు నిలిపివేశారు. దీంతో రహదారి పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఆర్ అండ్ బీ ఉన్నతాధికారులు సైతం రోడ్డు పనుల విషయంలో ఏం చేయలేక చేతులెత్తేశారు.

బిట్లు బిట్లుగా రోడ్డు పనులు

పనుల జాప్యం నేపథ్యంలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ ప్రభుత్వం నుంచి రోడ్డు, డ్రైనేజీల అభివృద్ధి కోసమంటూ మరో రూ.10 కోట్లు నిధులు మంజూరు చేయించారు. ప్రస్తుతం ఈ నిధులతోనే రావికమతం, బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్ట తదితర ప్రాంతాల్లో బిట్లు బిట్లుగా తారు రోడ్డు వేశారు. ఎన్‌డీబీ నిధులతో చేపట్టవలసిన రోడ్డు పరిస్థితి మాత్రం అలాగే ఉండిపోయింది.

మాడుగుల నియోజకవర్గం పరిధిలోనూ ఇంతే

ఇక మాడుగుల నియోజకవర్గం పరిధిలో వడ్డాది జంక్షన్ నుంచి తాటిపర్తి వరకు గల 14 కిలోమీటర్ల మేర రహదారి సైతం అత్యంత దయనీయంగా మారింది. ఈ రోడ్డులో పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. ఈ పనులు ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. రోడ్డు నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో వాహనచోదకులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఐఎన్ఎస్ సంధాయక్ జాతికి అంకితం



సర్వే నౌక 'ఐఎన్ఎస్ సంధాయక్'ను శనివారం విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డులో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయనకు నౌకాదళ అధికారులు జ్ఞాపిక అందజేశారు. - వివరాలు మెయిన్ 3వ పేజీలో..

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు

- రాత్రికి రాత్రే భారీ ఎత్తున తరలింపు



ప్రభుత్వ భూమిలో గ్రావెల్ తవ్విన ప్రాంతం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 3: కొండకర్ల పంచాయతీ సర్వే నంబరు 138లో గల ప్రభుత్వ భూమిలో శుక్రవారం రాత్రి భారీ స్థాయిలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరిగాయి. ఓ రియల్టర్‌తో స్థానిక వైసీపీ నాయకులు ఒప్పందం కుదుర్చుకుని శుక్రవారం రాత్రి ఎక్స్‌కవేటర్లతో గ్రావెల్ తవ్వకాలు చేపట్టి సుమారు 300 ట్రాక్టర్లలో తరలించారని స్థానికులు చెబుతున్నారు. శనివారం ఉదయానికి తవ్విన ప్రాంతంలో భారీ గొయ్యి కనిపించింది. విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకులు శనివారం ఆ ప్రాంతంలో ఆందోళన చేశారు. అధికారులు విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

క్రైం... crime news

269 మద్యం బాటిళ్లు స్వాధీనం



కొడవటిపూడిలో పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లు

కోటవురట్ల, ఫిబ్రవరి 3: మండలంలోని కొడవటిపూడిలో దాడి చేసి 269 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు. శనివారం నిర్వహించిన దాడిలో కర్రి అమ్మాజీ ఇంట్లో మద్యం బాటిళ్లను పట్టుకున్నట్టు చెప్పారు. స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్ల విలువ రూ.38,280 ఉంటుందన్నారు. బెల్ట్‌షాపులో ఆమె బాటిల్‌పై రూ.పది నుంచి రూ.20 అదనంగా విక్రయిస్తున్నదన్నారు. ఆమెపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా మద్యం అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడ అమ్మకాలు చేసినా తమకు సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు.

దిబ్బపాలెంలో..

కొత్తూరు : అనకాపల్లి మండలంలోని దిబ్బపాలెంలో అక్రమంగా విక్రయిస్తున్న బెల్టుషాపుపై అనకాపల్లి రూరల్‌పోలీసులు శనివారం దాడి చేశారు. ఈ దాడుల్లో షాపులో ఉన్న 10 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు మళ్ల ఉమాశంకర్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు.

ఉలిక్కిపడిన విశాఖ

... 5వ పేజీ తరువాయి

లేకుండాపోయింది.

ఎవరీ ప్రసాద్!

తన సోదరుడు, తహసీల్దార్ రమణయ్యను హత్య చేసింది ప్రసాదేనంటూ రాజేంద్ర ఆరోపిస్తుండడంతో అసలు...ఈ ప్రసాద్ ఎవరని ఆరా తీస్తున్నారు. పోలీసులు చెబుతున్న రియల్టర్, రాజేంద్ర ఆరోపిస్తున్న ప్రసాద్ ఒక్కరే అయి ఉంటారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మధురవాడలోని వుడా కాలనీలోని జువెల్ అపార్టుమెంట్‌లో ఉంటున్న గంగారాం ప్రసాద్ గతంలో ఒక రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేసి మానేశాడని సమాచారం. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా పనిచేస్తున్నాడు. రుషికొండ (సర్వేనంబర్ 22)లో రెండు ఎకరాల భూమిలో ఇటీవల కొన్ని భవనాలు నిర్మించాడని, అందుకోసం భారీగా అప్పులు చేశాడని, ఇప్పుడు విక్రయించాలనుకునేసరికి కన్వేయన్స్ డీడ్ అవసరం పడడంతో దానికోసం తహసీల్దార్ రమణయ్యను ఆశ్రయించినట్టు సమాచారం. తాజాగా రమణయ్యకు విజయనగరం జిల్లా బొండపల్లి మండలానికి బదిలీ కావడంతో ఆ పని తాను చేయలేనని రమణయ్య స్పష్టంచేయడంతో విచక్షణ కోల్పోయి హత్య చేసి ఉంటాడని కొంత మంది అనుమానిస్తున్నారు. అయితే ప్రసాద్ హత్య చేశాడా?, లేకపోతే వేరొకరితో హత్య చేయించాడా? అనేదానిపై కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు వివరాలను వెల్లడిస్తేనే గానీ హత్యకు గల కారణం, నిందితులు ఎవరనేది తెలిసే అవకాశం లేదు.

చెలరేగిన బుమ్రా

... 5వ పేజీ తరువాయి

చేరాడు. చివరి రెండు వికెట్లు వెంటవెంటనే పడిపోవడంతో భారత్ తొలి ఇన్నింగ్స్ 396 పరుగుల వద్ద ముగిసింది.

నిప్పులు చెరిగిన బుమ్రా...

లంచ్ సమయానికి ముందు ఇంగ్లండ్ బ్యాటింగ్ ప్రారంభించింది. ఓపెనర్ బెన్ డకెట్ (21) నిలదొక్కుకుంటున్న సమయంలో కులదీప్ యాదవ్ అద్భుతమైన బంతితో అవుట్ చేశాడు. అర్ధ సెంచరీతో ఊపు మీద కనిపించిన మరో ఓపెనర్ జాక్ క్రాలే (76)ను అక్షర పటేల్ పెవెలియన్‌కు పంపడంతో ప్రేక్షకులలో ఉత్సాహం వచ్చింది. 24వ ఓవర్‌లో బౌలింగ్‌కు వచ్చిన జస్ప్రీత్ బుమ్రా మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. తన రెండో ఓవర్‌లో రూట్ (5)ను అవుట్ చేసిన బుమ్రా...తర్వాత ఓవర్‌లో పోప్‌ను పెవెలియన్‌కు పంపాడు. తొలి టెస్టులో 196 పరుగులు చేసిన పోప్ (23)...ఈ మ్యాచ్‌లో వికెట్ల ముందు పాతుకుపోతున్న సమయంలో బుమ్రా అవుట్ చేయడంతో స్టేడియం హర్షధ్వానాలతో మారుమోగింది. కొద్దిసేపటికే జానీ బయిరెస్టో (25)ను కూడా బుమ్రా పెవిలియన్‌కు పంపడంతో ఇంగ్లండ్ 159 పరుగులకు ఐదు వికెట్లు పడిపోయి కష్టాల్లో పడింది. రెండో స్పెల్‌లో తిరిగి బౌలింగ్‌కు వచ్చిన బుమ్రా అదే ఊపును కొనసాగించాడు. వ్యక్తిగత 47 పరుగులతో ఉన్న కెప్టెన్ బెన్ స్టోక్‌ను అద్భుతమైన బంతితో క్లీన్ బౌల్డ్ చేయడంతో ఇంగ్లండ్ శిబిరం డీలాపడిపోయింది. బెన్ ఫోక్స్ (6), రెహన్ అహ్మద్ (6)లను కులదీప్ యాదవ్ పెవెలియన్‌కు పంపగా...చివరి బ్యాట్స్‌మెన్లు టామ్ హార్ట్‌లీ (21), అండర్సన్ (6)లను బుమ్రా అవుట్ చేయడంతో ఇంగ్లంగ్ ఇన్నింగ్స్ 253 పరుగుల వద్ద ముగిసింది. బుమ్రా 6 వికెట్లు తీయగా, కుల్దీప్ 3, అక్షరపటేల్ ఒక వికెట్ తీసుకున్నారు. 143 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యతతో రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన భారత్ కెప్టెన్ రోహిత్ శర్మ, జైస్వాల్‌కు ప్రేక్షకులు చప్పట్లతో స్వాగతం పలికారు. రెండో రోజు ఆట ముగిసే సరికి భారత్ ఐదు ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 28 పరుగులు చేసింది. జైస్వాల్ 15, రోహిత్‌శర్మ 13 పరుగులతో క్రీజులో ఉన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	97.00
లైవ్ ధర	117.00
విత్ స్కిన్	204.00
స్కిన్ లెస్	214.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

ఫుల్ జోష్!

▸ భారత్ ఆటగాళ్ల ప్రతిభకు ప్రేక్షకుల నీరాజనం

▸ చప్పట్లతో మార్మోగిన ఏసీఏ వీడీసీఏ స్టేడియం



జైస్వాల్ అద్భుత బ్యాటింగ్



బుమ్రాను అభినందిస్తున్న సహచర ఆటగాళ్లు



జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్



స్టేడియంలో క్రికెట్ అభిమానుల కోలాహలం

భారత్- ఇంగ్లండ్ జట్ల మధ్య ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరుగుతున్న రెండో టెస్ట్ మ్యాచ్ అభిమానుల్లో ఫుల్ జోష్ నింపుతోంది. బ్యాటింగ్‌లో సత్తా చాటిన టీమిండియా సభ్యులు, బౌలింగ్‌లోనూ విజృంభించడంతో ప్రేక్షకుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. మ్యాచ్‌ను వీక్షించేందుకు శనివారం భారీగా జనం తరలి వచ్చారు. దీంతో పలు స్టాండ్‌లు కిక్కిరిసిపోయాయి. జైశ్వాల్ డబుల్ సెంచరీ సాధించడంతో అభిమానుల కరతాళధ్వనులతో స్టేడియం హోరెత్తింది. ఇంగ్లండ్ బ్యాట్స్‌మన్లు పెవిలియన్‌కు క్యూ కడుతున్న సందర్భంలోనూ ప్రేక్షకులు కేరింతలు కొట్టారు. మొత్తమ్మీద టెస్ట్‌మ్యాచ్ వన్డే తరహాలో సాగుతుండడం అభిమానుల్లో ఫుల్ జోష్ నింపింది. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



యువతుల కేరింత



బుమ్రాతో రోహిత్‌శర్మ

రా.. కదిలి రా.. సభకు అనుమతులు ఇవ్వండి

▸ కలెక్టర్‌ను కోరిన టీడీపీ నాయకులు

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 3: కె.కోటపాడు మండలం గొండుపాలెంలో ఈనెల ఐదో తేదీన నిర్వహించనున్న రా.. కదిలి..రా కార్యక్రమానికి అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టిని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు కోరారు. శనివారం ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రానున్న వివరాలతో పాటు వెళ్లనున్న వివరాలు, ప్రసంగ సమయాన్ని కలెక్టర్‌కు వివరించారు. అలాగే ఎస్పీ కేవీ మురళీకృష్ణను కలిసి సభా ప్రాంగణం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భద్రతా ఏర్పాట్లు చేయాలని కోరారు. కలెక్టర్, ఎస్పీని కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యేలు కేఎస్ఎన్ఎస్ రాజు, పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ నాయకుడు మళ్ల సురేంద్ర తదితరులు ఉన్నారు.



రా... కదిలి ... రా సభకు అనుమతులు కోరుతూ వినతిపత్రాన్ని అందిస్తున్న బుద్ద నాగజగదీశ్వరరావు

డీఎస్సీ పేరుతో జగన్నాటకం

▸ టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికలకు ముందు డీఎస్సీ నోటిఫికేషన్ అంటూ నిరుద్యోగులను నమ్మించడానికి ముఖ్యమంత్రి సరికొత్త జగన్నాటకానికి తెరలేపారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అబద్ధాలు, మోసం, నయవంచనలకు బ్రాండ్ అంబాసిడర్ అయిన జగన్‌రెడ్డి నాలుగు సంవత్సరాల తొమ్మిది నెలలుగా ఉపాధ్యాయుల భర్తీని పట్టించుకోకుండా ఎన్నికల ముందు హడావుడి చేస్తున్నారన్నారు. మోగా డీఎస్సీ ఇస్తామని, ఆ తరువాత ఏడాదికి ఒక డీఎస్సీ అన్నారని, గిరిజన యువతకు ప్రత్యేక డీఎస్సీ అన్నారని, ఇపుడు 6వేల పోస్టులు భర్తీ చేస్తామని, అదికూడా అప్రెంటీస్‌గా అంటున్నారని అన్నారు. 2021-22 నాటికి ఏపీలో 50వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్రం పార్లమెంట్ సాక్షిగా చెప్పిందని, రాష్ట్ర వ్యాప్తంగా 18వేల ఖాళీలు ఉన్నాయి కానీ 8,366 పోస్టులు భర్తీ చేస్తామని మంత్రి బొత్స అసెంబ్లీలో చెప్పి ఇప్పుడు 6వేల పోస్టులకు నోటిఫికేషన్ అంటున్నారని, ఇది నిరుద్యోగ యువతను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. మూడు వారాల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానున్న తరుణంలో జగన్‌రెడ్డి చేస్తున్న హడావిడి వెనుక అంతర్యమేమిటో నిరుద్యోగులు తెలుసుకోలేని అమాయకులు కాదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టీఎస్‌టీయూసీ ఉపాధ్యక్షుడు ధనాల విష్ణుచౌదరి, తెలుగు యువత అధికార ప్రతినిధి బొడ్డేడ మురళి, పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి కోట్ని రామకృష్ణ, బీసీ నాయకుడు కొమ్మర్తి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు

పీఎం విశ్వకర్మ పథకం చేతి వృత్తుల వారికి వరం

▸ జిల్లా పరిశ్రమల అధికారి శ్రీధర్

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 3: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం చేతి వృత్తుల వారికి వరమని జిల్లా పరిశ్రమల అధికారి జీఎం శ్రీధర్ అన్నారు. శనివారం వీవీ రమణ రైతు భారతి హాల్‌లో నిర్వహించిన విశ్వకర్మ పథకంపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కళా నైపుణ్యాలకు మరింత మెరుగులు దిద్ది వారి కుటుంబాలకు ప్రపంచ ప్రఖ్యాతి అందించేందుకు విశ్వకర్మ కార్యక్రమం రూపొందించబడిందన్నారు. సంప్రదాయ కళాకారులకు ఆర్థిక చేయూతనివ్వడం జరుగుతుందన్నారు. ఏడు రోజులు పాటు శిక్షణ ఉంటుందని రూ. 500లు స్టైఫండ్ ఇస్తామన్నారు. డిజిటల్ సేవా కార్డుతో ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చునని, దానికి జిల్లా అమలు కమిటీ ఆమోదముద్ర వేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని 18 గుర్తించబడిన సంప్రదాయ వ్యాపారాల్లో ఉన్న అర్హులందరూ వినియోగించుకోవాలని సూచించారు. డీఎల్‌డీఓ మంజులావాణి మాట్లాడుతూ ఈ పథకంలో ఎంతమంది అయినా రిజిస్టర్ కావచ్చునని కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, కంశాలి, టైలరింగ్, సంప్రదాయ ఆట బొమ్మల రూపకర్తలు, తాపీ పని వారు, గంపలు తయారుచేసే వారు, చర్మకారులు, క్షురకులు, మత్స్యకారులు మొదలైన వృత్తులు వారు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ కో-ఆర్డినేటర్ ఏడీ ఎ. శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, డీపీవో శిరీషారాణి, లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి చాముండేశ్వరరావు, ఏపీడబ్ల్యూఓ నాగశిరీషా, డొమెస్ట్ నిపుణులు నాగేశ్వరరావు, పరమేశ్వరరావు, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు గంగారామ్, పట్టణ అధ్యక్షుడు కోటిపల్లి జేజిబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్

పోలీసుల కళ్లుగప్పి
బెంగళూరుకు నిందితుడు

▸ ఉదయమే విమానంలో చెన్నై వెళ్లినట్టు భావించిన పోలీసులు

▸ అక్కడకు వెళ్లిన ప్రత్యేక బృందం

▸ తీరా చూస్తే సాయంత్రం 4.30 గంటలకు చెన్నై విమానంలో బెంగళూరుకు...

▸ నాలుగు సిమ్‌లు మార్చి మార్చి వాడుతున్నట్టు గుర్తింపు

▸ ఒకసారి భార్య నుంచి కాల్...

విశాఖపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ రమణయ్య హత్య కేసులో నిందితుడు...పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే నగరం విడిచి పరారు కాగలిగాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిందితుడు తొలుత అనకాపల్లి వైపు వెళ్లి ఒకచోట తలదాచుకున్నట్టు పోలీసులు గుర్తించారు. అక్కడి నుంచి శనివారం ఉదయాన్నే ఎయిర్‌పోర్టుకు చేరుకుని చెన్నై వెళ్లిపోయినట్టు భావించిన పోలీసులు అక్కడకు ప్రత్యేక బృందాన్ని పంపించారు. ఈ క్రమంలో మధ్యాహ్నం రెండు గంటలకు విలేకరుల సమావేశం ఏర్పాటుచేసిన సీపీ రవిశంకర్‌అయ్యన్నార్ కూడా నిందితుడు ఎవరనే దానితోపాటు అతనికి సంబంధించిన పూర్తి వివరాలు, ఎక్కడికి వెళ్లిపోయాడు, ఎక్కడి నుంచి టికెట్లు బుక్ చేసుకున్నాడనే వివరాలు సంపాదించామని ప్రకటించారు. త్వరలో అతడిని అదుపులోకి తీసుకుంటామని ధీమా వ్యక్తంచేశారు. అయితే నిందితుడు శనివారం సాయంత్రం వరకూ నగరంలోనే ఉన్నాడని, 4.30 గంటలకు బెంగళూరు మీదుగా చెన్నై వెళ్లే విమానం ఎక్కినట్టు తెలియడంతో పోలీసులు కంగుతిన్నారు. నిందితుడు బెంగళూరులో విమానం దిగిపోయాడు. చెన్నై వెళ్లలేదు. అయితే నిందితుడు బెంగళూరులో ఉండిపోయిన విషయం తెలియని పోలీస్ అధికారులు అప్పటికే చెన్నై వెళ్లిన బృందాన్ని అక్కడి ఎయిర్‌పోర్టుకు పంపించి విశాఖ నుంచి వచ్చిన విమానంలో నిందితుడి కోసం వెతికించారు. నిందితుడు కనిపించకపోవడంతో అతని సెల్‌ఫోన్ టవర్ లొకేషన్ పరిశీలించగా బెంగళూరులోనే ఉండిపోయినట్టు తేలింది. నిందితుడు అప్పటికే నాలుగు సిమ్ కార్డులు మార్చి మార్చి వాడుతున్నట్టు, అతని భార్య కూడా శనివారం ఒకసారి ఫోన్ చేసి మాట్లాడినట్టు కాల్‌డేటాలో పోలీసులు గుర్తించినట్టు తెలిసింది. ఏదిఏమైనా పోలీసులు నిందితుడి ఆచూకీని పక్కాగా కనిపెట్టగలిగి ఉంటే నగరంలోనే అతడిని అరెస్టు చేసి ఉండగలిగేవారు. కానీ సరిగా అంచనా వేయలేకపోయారు. నిందితుడు ఉదయాన్నే నగరం విడిచి విమానంలో వేరే రాష్ట్రం వెళ్లిపోయినట్టు భావించారు. దీనివల్ల నిందితుడు నగరంలో జరుగుతున్న తతంగాన్ని మీడియాలో చూసి...సాయంత్రం బెంగళూరు వెళ్లాడు. నిందితుడు ఎవరనేది తెలిసినందున శనివారం ఉదయం నుంచి సరిహద్దుల్లో వాహనాల తనిఖీలు చేయడం, ఎయిర్‌పోర్టు, రైల్వేస్టేషన్, బస్‌కాంప్లెక్స్‌లో నిఘా పెట్టినట్టయితే తప్పించుకునేందుకు అవకాశం ఉండేది కాదని కొంతమంది పోలీసులే అభిప్రాయపడుతున్నారు.

AJC CLASSIFIEDS

HOME TUITIONS

★ **S.S. HOME TUITIONS.** KG to PG, SSC / CBSE / ICSE, Inter (IIT / NEET / EAMCET, +1, +2), Diploma & B.Tech (All Bran). Want M/F. Cont.: 7799885853, 8309358985 AJV_164637

FLATS FOR SALE

★ **New Flat for Sale.** 1050+60 sft., 2 BHK E/F, 3rd Floor, Ramadevi Nilayam Apt., Teachers Layout, Water Tank, Sujatha Nagar. Cont.: 9492333678, 6300938483 AJV_183118

★ **2 BHK, 910 sft.** N/E Corner E/F Sale in Old Karasa Near NAD-X Road 10 min Walkable Distance. No Car Parking, No Lift. Cont.: 9298158702 AJV_183201

★ పెందుర్తి మహిళా ప్రాంగణం అఖిలేశ్వరి హాస్పిటల్ దగ్గర 2 BHK 990 sft. వాస్తు, కార్ పార్కింగ్, లిఫ్ట్, జనరేటర్, NE కార్నర్ 40' రోడ్స్ నార్త్ ఈస్ట్ ఫేసింగ్, HDFC లోన్స్ సంప్ర॥ 9246628802, 9396558800 AJV_183120

★ **పెందుర్తి, చినముషిడివాడ** మెయిన్ దగ్గర S/F 3 BHK (1100 + 100 కారు పార్కింగ్) టాప్ ఫ్లోర్ 4 సం॥లు ఓల్డ్ గల జనరేటర్ సదుపాయంతో 43 లక్షలకు అమ్మకము కలదు. సంప్ర॥ 70755 53377 AJV_183209

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

PLOTS FOR SALE

★ **Registered Panchayathi** Plot for Sale in Majjipeta 12 km from Tagarapuvalasa, 6000/- per sq.yd., Clear Titles, 200 sq.yds., Cont.: 7075635487, 9912109876. AJV_183119

★ **విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్** పరిధి అప్పికొండ గ్రామంలో సర్వే నెం. 9,10లో గల 116 చ॥గ॥ స్థలం (జిరాయితీ) అమ్మకానికి కలదు. సంప్ర॥ 9347586574 AJV_183207

★ **అనకాపల్లి, కశింకోట** NH-5 రైల్వేస్టేషన్ దగ్గరలో ఫామ్ ల్యాండ్ 125 గజాల నుండి కలవు. అతి తక్కువ ధర అందరికీ అందుబాటులో కలవు. సంప్ర॥ 9347581932 AJV_183117

LAND FOR SALE

★ **MVR Consultancy** Premium farmland & plots for outright sale spot registration 1.2 lakhs per cent 6acres 14 blocks nr green field highway nr KOTHAVALASA. pass-book will be done by us. Ph: 9848372035 AJV_183208

JOBS

★ **విశాఖపట్నం నందు లాడ్జి & రెస్టారెంట్‌లో** పనిచేయుటకు రిసెప్షనిస్ట్, క్యాషియర్, బెల్‌బాయ్స్, వెయిటర్స్ కావలెను. ఫోన్: 9246234599. AJV_164593

TO - LET

▸ **Vizag, RK Beach : E/F, Sea View,** 2nd Floor Corner, Fully Furnished 3 BHK (1750 S.ft) Flat Rent. Call or WhatsApp : +16306420327 / +91 7382046990 AJB_2840

BUSINESS OFFER

★ **Sri Avani Eco-life Pvt. Ltd.** తక్కువ పెట్టుబడితో వ్యాపారాన్ని ప్రారంభించండి. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా బయోడిగ్రేడబుల్ కవర్లను మార్కెటింగ్ చేయుటకు మండలాల వారిగా డీలర్లు కావలెను. Ph:9493786468 / 6301041696. AJH-13344

For Advertisement Contact : 9963231176, 9966165093

इंडियन बैंक Indian Bank | **ఇండియన్ బ్యాంక్** | జోనల్ ఆఫీస్ రాజమండ్రి

డోర్ నెం.79-3-7, 3వ అంతస్థు, ఆర్‌టిసి కాంప్లెక్స్ (క్రోమా బిల్డింగ్), ఆర్‌కె ప్లాజా, రిలయన్స్ పెట్రోల్ బంక్ ఎదురుగా, రాజమండ్రి, తూ.గో.జిల్లా, ఆం.ప్ర.533101.
ఫోన్ నెం.: 0883-2439988 / 2477488. ఈ-మెయిల్ ఐడి : ZORAJAHMUNDRY@indianbank.co.in

అపెండిక్స్-IV-A (నిబంధన 8(6) అంశాలు చూడండి)

స్థిరాస్తులు విక్రయమునకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002లోని రూల్ 8(6) & 6(2) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి ముఖ్యంగా "ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)"లకు నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా, సెక్యూర్డు క్రెడిటార్‌కు తనఖా పెట్టిన / ఛార్జీ చేసిన దిగువ తెలిపిన స్థిరాస్తులను ఇండియన్ బ్యాంక్, బ్రాంచ్ (సెక్యూర్డ్ క్రెడిటార్) అధీకృత అధికారిచే భౌతికంగా/నిర్మాణాత్మకంగా/లాంఛనముగా (ఏది వర్తించునో అది) స్వాధీనం చేసుకున్న సదరు స్థిరాస్తులను బ్యాంకు వారికి రావలసిన బకాయిలు రాబట్టుకునేందుకు "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" ప్రాతిపదికన ఇ-వేలం ద్వారా తేది. 21.02.2024 న ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించటమైనది.

భాస్కర్‌నగర్ బ్రాంచ్, కాకినాడ

ఋణగ్రహీత & హామీదారు పేర్లు మరియు చిరునామా : ఆనంద్ కంప్యూటర్స్, ప్రొప్రయిటర్ : శ్రీ కర్రి ఆనంద్ సాయి కృష్ణ, తండ్రి : శ్రీ కర్రి తాతారావు, 2. శ్రీ కర్రి ఆనంద్ సాయికృష్ణ, తండ్రి : కర్రి తాతారావు, 3. శ్రీమతి కర్రి గంగా యమున సరస్వతి నీలమణి, భర్త : శ్రీ కర్రి ఆనంద్ సాయికృష్ణ, డి.నెం. 3-16ఎ-91ఎ, బర్మా కాలనీ, కాకినాడ.

తేది. 17.05.2023 నాటికి రావలసిన బకాయి మొత్తం : రూ. 13,43,299/- (అక్షరాల పదమూడు లక్షల నలభై మూడు వేల రెండు వందల తొంభై తొమ్మిది రూపాయలు మాత్రమే) + భవిష్య వడ్డీ + వర్తించు ఛార్జీలు.

స్థిరాస్తుల వివరములు : విశాఖపట్నం జిల్లా, నక్కపల్లి సబ్-రిజిస్ట్రార్, పాయకరావుపేట మండలం, ఆరట్లకోట గ్రామం & గ్రామ పంచాయితీ, రిసొల్యూషన్ నెం.11, తేది. 24.11.206, సర్వే నెం.లు 13-4, 14-1, 14/2 & 4, ప్లాటు నెం.24 నందు 173.39 చ॥గ॥లు లేదా 144.76 చ॥మీ॥ల విస్తీర్ణం గల రెసిడెన్షియల్ స్థలం యావత్తు ఆస్తి శ్రీమతి కర్రి G Y S @ నీలవేణి, భర్త : శ్రీ కర్రి ఆనంద్ సాయి కృష్ణ గారికి చెందినది. హద్దులు మరియు కొలతలు : తూర్పు : ప్లాటు నెం.25 నందు 47.4 అ॥లు = 14.45 మీటర్ల స్థలం, పడమర : ప్లాటు నెం.23 నందు 47.3 అ॥లు = 14.42 మీటర్ల స్థలం, ఉత్తరం : మంగవరం వెళ్ళు రోడ్ 33.0 అ॥లు = 10.06 మీటర్లు, దక్షిణం : ప్లాటు నెం.28 నందు 33.0 అ॥లు = 10.06 మీటర్లు స్థలం.

పై హద్దుల మధ్య 173.39 చ॥గ॥ల విస్తీర్ణం ఖాళీ ఇంటి స్థలం నందు అన్ని సాధారణ మార్గాలు, ఈజుమెంటరీ హక్కులు మొ॥నవి.

రిజర్వు ధర : రూ.12,48,000/- | ధరావత్తు మొత్తం : రూ.1,30,000/- | ఆస్థి ఐడి నెం. : IDIB069314240210

* పైన తెలిపిన అన్ని ఆస్తులకు వర్తించును. * ఆస్తి/లు పై ఋణభారములు ఏమైనా ఉన్నచో : లేవు

బిడ్ పెంపుదల మొత్తం రూ.10,000/- లు గా నిర్ణయించడమైనది.

ఇ-వేలం తేది & సమయం : 21-02-2024, ఉదయం గం.10.00 నుండి సాయంత్రం గం.04.00 ల వరకు

వేలం బిడ్ ఫారం మరియు నియమ నిబంధనల కొరకు మా ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ MSTC Ltd వారి వెబ్‌సైట్ (www.mstcecommerce.com/auction/home/ibapi) నందు చూడవలసినదిగా బిడ్డర్స్‌కు సలహా ఇయ్యడమైనది. ఇ-వేలం పూర్తి విధానం సాంకేతిక సహాయం కొరకు MSTC హెల్ప్‌డెస్క్ నెంబర్ 033-23400020/23400021/23400022 మరియు సర్వీస్ ప్రొవైడర్స్ వద్ద లభించు ఇతర హెల్ప్‌లైన్ నెంబర్లను సంప్రదించండి. MSTC Ltd తో రిజిస్ట్రేషన్ స్టేటస్ కోసం దయచేసి ibapiop@mstcecommerce.com ను మరియు EMD స్టేటస్ కోసం ibapifin@mstcecommerce.com ను సంప్రదించవచ్చును.

ఆస్తి వివరాలు మరియు ఆస్తి యొక్క ఛాయాచిత్రం కోసం మరియు వేలం యొక్క నిబంధనలు మరియు షరతుల కోసం దయచేసి https://ibapi.in ను సందర్శించగలరు. ఈ పోర్టల్‌కు సంబంధించిన వివరణల కోసం దయచేసి హెల్ప్‌లైన్ నెంబర్. 18001025026 మరియు 011-41106131 ను సంప్రదించండి.

https://ibapi.in మరియు www.mstcecommerce.com వెబ్‌సైట్‌లో ఆస్తి కోసం చూస్తున్నప్పుడు పైన పేర్కొన్న ఆస్తి ఐడి నెంబర్‌ను ఉపయోగించి బిడ్డర్లు చూడగలరు.

తేది : 02.02.2024, ప్రదేశం : రాజమండ్రి | సం/- అధీకృత అధికారి, ఇండియన్ బ్యాంక్, జోనల్ ఆఫీస్, రాజమండ్రి

'రా.. కదలిరా.. సభను విజయవంతం చేయాలి'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ

తుమ్మపాల, ఫిబ్రవరి 3: మాడుగులలో ఈనెల ఐదో తేదీన జరిగే రా.. కదలిరా.. మహాసభను టీడీపీ, జనసేన శ్రేణులంతా విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ప్రైవేటు కల్యాణ మండపంలో టీడీపీ, జనసేన నాయకుల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. అనకాపల్లి నియోజకవర్గం నుంచి వేలాది మంది టీడీపీ, జనసేన నాయకులు సభకు తరలివెళ్లాలన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం లక్ష్యంగా కార్యకర్తలంతా పనిచేయాలన్నారు. టీడీపీ నాయకులు దాడి రత్నాకర్, జయవీర్ మాట్లాడుతూ వైసీపీ ఓటమే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా పనిచేయాలని సూచించారు. టీడీపీ, జనసేన నాయకులంతా ఒకే కుటుంబంలా ముందుకు సాగాలన్నారు. రాష్ట్రంలో వైసీపీని తరిమికొట్టేందుకు అంతా నడుం బిగించాలన్నారు. జనసేన అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి పరుచూరి భాస్కరరావు మాట్లాడుతూ టీడీపీ, జనసేన పొత్తుతో వైసీపీ నాయకుల్లో వణుకు పుడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కరోతి బంగార్రాజు, పతివాడ తమ్మునాయుడు, పీలా శ్రీకాంత్, రవిశంకర్, కాయల మురళీ, కోట్ని బాలాజీ, మళ్ల సురేంద్ర, మాదంశెట్టి నీలబాబు, సందిన చినబాబు, కొణతాల శ్రీనివాసరావు, పచ్చికూర రాము తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌కే అద్వానీకి దాడి అభినందనలు


అద్వానీతో మాజీ మంత్రి దాడి (ఫైల్)

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 3: భారతరత్న పురస్కారానికి ఎంపికైన రాజనీతిజ్ఞుడు ఎల్‌కే అద్వానీకి మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అభినందనలు తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో చంద్రబాబునాయుడుతో పనిచేసి తెలుగుదేశం పార్టీకి అద్వానీ మరింత ఆప్తులయ్యారన్నారు. భగవాన్ సత్యసాయిబాబా కార్యక్రమంలో అద్వానీ, వెంకయ్యనాయుడు, తాను సత్యసాయిబాబా వారి ఔనత్యం గురించి మాట్లాడుకున్నామన్నారు. మూడేళ్లలో 100వ జన్మదిన వేడుకలు జరుపుకునే అద్వానీకి భారతరత్న పురస్కారం రావడం దేశానికే గర్వకారణమన్నారు.

10న 'చలో కాకినాడ'ను విజయవంతం చేయాలి

» డీబీపీ రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు దాసరి అన్నపూర్ణ


సమావేశంలో మాట్లాడుతున్న అన్నపూర్ణ

పాయకరావుపేట, ఫిబ్రవరి 3 : డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రక్షించుకుందాం అంటూ దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 10న కాకినాడలో చేపట్టిన జాతీయ సదస్సును విజయవంతం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి ఏపీ రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు దాసరి అన్నపూర్ణ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణస్వరూప్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి జగన్ పాలనలో దళిత జీవనం, మానవ హక్కులు కాలరాశారని ఆరోపించారు. దళితులకు చెందిన 18 రకాల సంక్షేమ పథకాలను రద్దుచేసి జాతి పురోగతిని అడ్డుకుంటున్నారని, రానున్న ఎన్నికల్లో ఈ పార్టీలను ఓడించకపోతే దళిత జాతికి బానిసత్వం తప్పదన్నారు. ఈనెల 10వ తేదీ ఉదయం 10 గంటలకు కాకినాడలోని పీఆర్.కళాశాల దగ్గరలో మెక్లార్డ్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో సదస్సు నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో డీబీపీ జిల్లా అధ్యక్షుడు దువ్వాడ దావీదు, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు తట్టా శ్రీనివాసరావు, చిరుకూరి రమణ, బోడపాటి లక్ష్మి, కశింకోట హనుమంతరావు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్న ఎమ్మెల్యే

మునగపాక, ఫిబ్రవరి 3: స్థానిక గౌరీ పరమేశ్వరులను శనివారం ఎమ్మెల్యే కన్నబాబు దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఈనెల 19వ తేదీన జరగనున్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన పోస్టరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

43వ రోజు కొనసాగిన న్యాయవాదుల రిలే దీక్షలు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 3 : భూ హక్కుల చట్టం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కోర్టు వద్ద న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు శనివారం నాటికి 43వ రోజుకి చేరుకున్నాయి. ఈ దీక్షల్లో న్యాయవాదులు సాయిరాం, రాంప్రసాద్ కూర్చున్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. సాయి వెంకట లక్ష్మణ్, సెక్రటరీ సూర శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే భూహక్కుల చట్టం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

జిల్లా బాల, బాలికల హాకీ జట్ల ఎంపిక


జిల్లా హాకీ జట్టు క్యాంపునకు ఎంపికైన బాల, బాలికల జట్లు

ఎలమంచిలి, ఫిబ్రవరి 3: ఎలమంచిలి రాజీవ్‌గాంధీ క్రీడా మైదానంలో బాల, బాలికల జిల్లా హాకీ జట్ల క్యాంపునకు క్రీడాకారులను ఎంపిక చేసినట్టు జిల్లా అడ్‌హాక్ కమిటీ ప్రతినిధి కొఠారు నరేష్ తెలిపారు. అడ్‌హాక్ కమిటీ ప్రతినిధి ఆడారి వీరునాయుడు సహకారంతో బాల, బాలికల ప్రాబబుల్స్‌ను ఎంపిక చేశామన్నారు. ఎంపికైన వీరిలో రాష్ట్ర పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లకు ఎంపిక చేస్తాన్నారు. ఈనెల 9వ తేదీన ఎంపికైన బాలికల జట్టు శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర పోటీల్లో, బాలురు జట్టు నంద్యాలలో జరిగే టోర్నీలో పాల్గొంటాయని తెలిపారు. శనివారం జరిగిన కార్యక్రమంలో అడ్‌హాక్ కమిటీ సభ్యులు ఏబీఎల్.రాజు, జి.రాంబాబు పాల్గొన్నారు.

అండర్‌బ్రిడ్జి కింద ఇరుక్కుపోయిన వ్యాన్

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 3 : స్థానిక విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి ఇనుప గడ్డర్ కింద శనివారం మధ్యాహ్నం భారీ లోడుతో వెళ్తున్న వ్యాన్ ఇరుక్కుపోయింది. అనకాపల్లి నుంచి చోడవరం వైపు వెళ్తున్న ఈ వ్యాన్ అండర్‌బ్రిడ్జి కింద రైల్వే శాఖ ఏర్పాటు చేసిన గడ్డర్ కింద ఇరుక్కుపోవడంతో అనకాపల్లి-చోడవరం మధ్య ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ట్రాఫిక్ పోలీసులు స్పందించి సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఆర్‌పీఎఫ్ అధికారులు వ్యాన్ డ్రైవర్‌పై చర్యలు చేపట్టారు.

నాడు అనర్హులు.. నేడు అర్హులా

» జనసేన మండల ఉపాధ్యక్షుడు ఆనంద్

మునగపాక, ఫిబ్రవరి 3: జగనన్న కాలనీకి సంబంధించి నాడు అనర్హులు అంటూ కొందరి పేర్లను తొలగించి ఎన్నికలు సమీపిస్తుండడంతో వారందరికి పట్టాలు అందజేయడం హేయమైన చర్య అని జనసేన మండల ఉపాధ్యక్షుడు మొల్లేటి ఆనంద్ అన్నారు. శనివారం ఆయన ఉమ్మలాడలో జగనన్న కాలనీని పార్టీ నాయకులతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేవలం వైసీపీ సానుభూతిపరులకే జగనన్న ఇళ్లకు ఎంపిక చేశారన్నారు. కాలనీలో ఇప్పటివరకూ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కాళ్ల చంద్రమోహన్, పల్లి నరసింగరావు, కరోతి వాసు, మొల్లేటి పవన్ తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ప్రాంతీయ కార్యాలయం: విజయనగరం
బంగారు ఆభరణాల అప్రైజర్ ఎంపానల్మెంట్ ప్రకటన

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, విజయనగరం ప్రాంతీయ కార్యాలయం వారు నూతన గోల్డ్ అప్రైజర్/ప్రొఫెషనల్స్ కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేయాలని భావిస్తున్నారు. బంగారు ఆభరణాల నాణ్యత మూల్యాంకన ప్రక్రియలో సహాయం చేయుటకు దిగువ తెలిపిన శాఖల వద్ద వారు పని చేయవలసి ఉంటుంది. అర్హత, దరఖాస్తు మరియు పూర్తి వివరాల కొరకు మా బ్యాంకు వెబ్‌సైట్ www.unionbankofindia.com ను లేదా మా సమీప యూనియన్ బ్యాంక్ శాఖను సంప్రదించగలరు.

ప్రకటణ తేదీ:04-02-2024, ధరఖాస్తు ఆఖరి తేదీ: 18-02-2024

అప్రైజర్ కావాల్సిన శాఖలు:
శ్రీరంగరాజపురం, విజయనగరము, పెదతాడివాడ, చోడవరం, అంకుపాలెం, అనకాపల్లి ఫూల్ అప్రైజర్స్ (విజయనగరం ప్రాంతీయ కార్యాలయం కొరకు) మరిన్ని వివరములు కొరకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం, విజయనగరం సెల్: 9652578210 నందు సంప్రదించవచ్చును.

రీజనల్ హెడ్

సార్వత్రిక ఎన్నికలకు సిద్ధంకండి

టీడీపీ శ్రేణులకు మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి పిలుపు


సబ్బవరం: నల్లరేగులపాలెంలో జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న బండారు సత్యనారాయణమూర్తి

సబ్బవరం, ఫిబ్రవరి 3 : మరో రెండు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు ఉన్నందున పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని నల్లరేగుల పాలెంలో శనివారం రాత్రి జరిగిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు ఎత్తేస్తారని వలంటీర్లు దుష్ప్రచారం చేస్తున్నారని, దాన్ని పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి తిప్పికొట్టాలన్నారు. మూడు నెలలుపాటు పింఛన్ తీసుకోకపోయినా.. తరువాత రూ.9 వేలు ఇచ్చేలా బాబు ఆలోచన చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ శ్రేణులు పోరాటానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. మరో 15 రోజులో జనసేన, టీడీపీ అభ్యర్థుల జాబితా విడుదలవుతుందన్నారు. సీనియర్ నాయకులు కె.రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నేతలు భరణికాన బాబూరావు, గండి రవికుమార్, ఎం. మహాలక్ష్మీనాయుడు, గండి ముత్యాలనాయుడు, కొటాన అప్పారావు, రేసుపూడి రమణ, దొడ్డి ప్రకాశ్, ఆడారి నాగరాజు పాల్గొన్నారు.


తుమ్మపాల: గవరపాలెంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం : పీలా

తుమ్మపాల: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. శనివారం గవరపాలెంలో నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తంగా మారిందన్నారు. వైసీపీ నాయకుల అరాచకాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయన్నారు. రాష్ట్రంలో కల్తీ మద్యం, ల్యాండ్, ఇసుక మాఫియాలకు బ్రాండ్ అంబాసిడర్ జగన్‌రెడ్డి అని అన్నారు. చంద్రబాబునాయుడు పాలన కోసం రాష్ట్రం ఎదురుచూస్తుందన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మళ్ల సురేంద్ర, బీఎస్ఎంకే జోగినాయుడు, పోలారపు త్రినాథ్, పొలిమేర నాయుడు, కాండ్రేగుల సురేష్, పెంటకోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

» జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ


పార్కు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 3 : జీవీఎంసీ అనకాపల్లి జోన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన జీవీఎంసీ అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథ్‌తో కలిసి అనకాపల్లిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. జలగలమదుం జంక్షన్ నుంచి సుంకరమెట్ట వరకు రోడ్డు పనులు, కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు, శారదానది వద్ద శాంతిపార్కు అభివృద్ధి పనులతోపాటు గాంధీనగరంలోని కల్యాణ మండపం ఆధునీకరణ పనులు పరిశీలించారు. అనంతరం జోనల్ కార్యాలయంలో అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. రహదారుల నిర్మాణ పనులు, ఎన్టీఆర్ స్టేడియం, గాంధీనగరం వద్ద మీటింగ్ హాల్, గెస్ట్‌హౌస్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజనీర్ రామ్మోహనరావును కమిషనర్ ఆదేశించారు. శాంతిపార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను ఈనెల 15వ తేదీ నాటికి పూర్తి చేసి పార్కు నిర్వహణ కోసం టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజనీర్లు కృష్ణారావు, గణపతిరావు, చీఫ్ సిటీ ప్లానర్ సురేష్‌కుమార్, కార్యనిర్వాహక ఇంజనీర్లు చిరంజీవి, రాయల్‌బాబు, ఏసీపీ రుణ్మిస్ టీపీవో జనార్దన్, ఉద్యానవన శాఖ అధికారులు సురేష్, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

రైతుల విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

» ఈపీడీసీఎల్ ఎస్ఈ మహేంద్రనాథ్


ఇంటర్ లాకింగ్ లైన్‌కు సంబంధించి మ్యాప్ పరిశీలిస్తున్న ఎస్ఈ మహేంద్రనాథ్

నక్కపల్లి, ఫిబ్రవరి 3: మండలంలోని డొంకాడ సహా మెరక గ్రామాల్లో రైతుల విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీఈపీడీసీఎల్ (ఆపరేషన్) ఎస్ఈ మహేంద్రనాథ్ చెప్పారు. శనివారం సాయంత్రం గొడిచెర్లలో రైల్వే వంతెన సమీపాన ఇంటర్ లాకింగ్ లైన్‌ను ఆయన పరిశీలించారు. గొడిచెర్ల నుంచి డొంకాడకు వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయడానికి రైల్వే వంతెన వుందని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ ఆయనకు చెప్పారు. దీనివల్ల చినదొడ్డిగల్లు నుంచి విద్యుత్ సరఫరా చేయడం వల్ల గాలి, వానకు సరఫరా నిలిచిపోతోందని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. గొడిచెర్ల రైల్వే వంతెన కింద నుంచి ఇంటర్ లాకింగ్ లైన్ ఏర్పాటు చేయాలని కోరగా, ఇందుకు సంబంధించిన మ్యాప్‌లను ఎస్ఈ పరిశీలించారు. అనంతరం వేంపాడులో పర్యటించారు. వేంపాడులో అదనంగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని మహేంద్రనాథ్ హామీ ఇచ్చారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్‌పర్సన్ అయినంపూడి మణిరాజు, సురేశ్ రాజు, డొంకాడ సర్పంచ్ చందిన కొండలరావు, పొడగట్ల పాపారావు, ఏపీఈపీడీసీఎల్ డీఈఈ రాజశేఖర్, పాయకరావుపేట ఏడీ లక్ష్మీనారాయణ, ఏఈఈ కృష్ణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎండీఎం కార్మికుల ఆందోళన


సబ్బవరంలో ఎంఈవో మూర్తికి వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

పరవాడ, ఫిబ్రవరి 3 : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు శనివారం ఎంఈవో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం యూనియన్ మండల అధ్యక్షురాలు సీహెచ్. దేముడమ్మ మాట్లాడుతూ ఎన్నికల్లో సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం నెలకు వేతనం పది వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు యూనిఫారాలు అందజేయాలని, మెస్ చార్జీలు పెంచాలని, ఐడీ కార్డులు పంపిణీ చేయాలని కోరారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

సబ్బవరంలో.. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు శనివారం సీఐటీయూ నేతలతో కలిసి ఎంఈవో-2 బీఎస్ఎన్ మూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకురాలు ఉప్పాడ సత్యవతి,ఎస్.గౌరీ, వరహాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో.. తమ సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజనం పథకం, స్కూలు శానిటేషన్ కార్మికులు శనివారం ఆందోళన చేశారు. అనంతరం విద్యాశాఖ కార్యాలయాధికారికి వినతి పత్రం అందజేసినట్టు జిల్లా ప్రతినిధులు శ్రీదేవి, జానకి తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మ, మహాలక్ష్మి, మణి పాల్గొన్నారు.

పెట్టుబడుల్లో రాష్ట్రం అథమ స్థానం : ప్రగడ


సమావేశంలో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి, ఫిబ్రవరి 3: తెలుగుదేశం పాలనలో పెట్టుబడుల విషయంలో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉండగా వైసీపీ ప్రభుత్వ హయాంలో అథమ స్థానంలో ఉందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు విమర్శించారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమలు రాకపోవడంతో నిరుద్యోగులు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గంజాయిని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ముఖ్యమంత్రి సభ కోసం ఇంటర్ పరీక్షలు వాయిదా వేయడం దారుణమన్నారు. మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీల ఉందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు గొర్లె నానాజీ, రాజాన సూర్య నాగేశ్వరరావు, గొర్లె బాబూరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పథకాలను ప్రారంభించిన ఎమ్మెల్యేలు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 3: మండలంలోని గుడివాడలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లీనిక్ భవనాలను శనివారం ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, కంబాల జోగులు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోన లోవలక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి, వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, వైసీపీ నాయకులు చిక్కాల రామారావు, కొణతాల శ్రీనివాసరావు, పోలిశెట్టి పెద ఈశ్వరరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలు ప్రారంభం

సబ్బవరం, ఫిబ్రవరి 3 : మండలంలోని మలునాయుడుపాలెం, బోదివలస, అంతకాపల్లి, వంగలి, ఆరిపాక గ్రామాల్లో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, సర్పంచులు బోని దేముడమ్మ, నేబర్తి శ్రీను, నారాయణమూర్తి, పాలిశెట్టి పార్వతి, నేతలు బోకం రామునాయుడు, కర్రి బాబు, సురేశ్‌రాజ్ పాల్గొన్నారు.

తహసీల్దార్ హత్యపై రెవెన్యూ ఉద్యోగుల నిరసన

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 3: విశాఖలో జరిగిన తహసీల్దార్ రమణయ్య హత్యను ఖండిస్తూ స్థానిక డీటీ శ్యామ్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది శనివారం నల్ల రిబ్బన్‌లను ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ విశాఖలో తహసీల్దార్‌పై జరిగిన హత్యను సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

గోవిందపాలెంలో ఘనంగా శ్రీకృష్ణాంజనేయ తీర్థం

రాంబిల్లి, ఫిబ్రవరి 3 : మండలంలోని గోవిందపాలెంలో శనివారం శ్రీకృష్ణాంజనేయ తీర్థం ఘనంగా జరిగింది. స్థానికులే కాకుండా సమీప గ్రామాలకు చెందిన భక్తులు స్వామివార్లను దర్శించి పూజలు చేశారు. మధ్యాహ్నం స్వామివార్ల సన్నిధిలో అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక భజనలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

చలో అసెంబ్లీ ముట్టడిని విజయవంతం చేయండి

» పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యేజెర్ల వినోద్‌రాజు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 3: పలు సమస్యలపై సర్పంచులు ఈనెల 6వ తేదీన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యేజెర్ల వినోద్‌రాజు శనివారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన 14, 15 ఆర్థిక సంఘం నిధులు రూ.8,629 కోట్లను తిరిగి సర్పంచుల ఖాతాల్లో జమ చేయాలని, సచివాలయాలు, వలంటీర్లు, గ్రామ సర్పంచుల ఆధీనంలోనే పనిచేయాలని, ఉపాధి హామీ నిధులు పంచాయతీలకు ఇచ్చి ఖర్చు చేయించడం, పంచాయతీలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని, తదితర 16 డిమాండ్ల పరిష్కారానికి చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

'నెలాఖరులోగా సమస్య పరిష్కరించకుంటే రోడ్డు మూసేస్తాం'


సంతకాలు సేకరిస్తున్న సీపీఎం నేతలు

మునగపాక, ఫిబ్రవరి 3: అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డును ఈనెలాఖరులోగా బాగు చేయించకుంటే మూసేస్తామని సీపీఎం నాయకులు ప్రకటించారు. శనివారం నాగులాపల్లిలో రోడ్డుపై ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం వేలాదిమంది రాకపోకలు సాగిస్తున్న ఈ రోడ్డు దుస్థితిపై అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రోడ్డు సమస్య తీర్చకుంటే భారీగా జన సమీకరణ చేపట్టి ప్రజలతో మూయించి వేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్.బ్రహ్మాజీ, కాండ్రేగుల సదాశివరావు, వీవీ శ్రీనివాసరావు, శరగడం కన్నంనాయుడు, కాండ్రేగుల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

'అన్నింటా మునిసిపాలిటీ అభివృద్ధి'

ఎలమంచిలి, ఫిబ్రవరి 3: మునిసిపాలిటీలో కోట్లాది రూపాయలతో రోడ్లు, కమ్యూనిటీ భవనాలను నిర్మిస్తామని ఎమ్మెల్యే కన్నబాబు అన్నారు. శనివారం మునిసిపాలిటీలో పెదపల్లి, ధర్మవరం వార్డుల్లో రోడ్లను ప్రారంభించారు. అదే విధంగా గాంధీనగర్ వార్డులో కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్నింటా అభివృద్ధి చేశామన్నారు. చైర్‌పర్సన్ రమాకుమారి మాట్లాడుతూ మునిసిపాలిటీని అన్ని రంగాల్లోనూ ముందంజలో నిలిచేలా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ కొండలరావు, డీఈఈ వీరయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, మునిసిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

రాజుపేటలో ఉపాధి హామీ గ్రామసభ

కోటవురట్ల, ఫిబ్రవరి 3: మండలంలోని రాజుపేటలో సామాజిక ఆడిట్ బృందం తనిఖీలు నిర్వహించింది. శనివారం రాజుపేటలో సర్పంచ్ బొడ్డేటి వెంకటరమణ అధ్యక్షతన ఉపాధి హామీ పథకం గ్రామసభ చర్చవేదిక నిర్వహించారు. గ్రామంలో కూలీలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో గ్రామసభ నిర్వహించి, సోషల్ ఆడిట్ బృందం తనిఖీ చేసిన నివేదికకు ఆమోదం పొందారు. ఎస్ఆర్‌పీ రామారావు, ఏపీవో గంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థుల ప్రగతి పరిశీలన


విద్యార్థిని హోమ్‌వర్క్‌ను పరిశీలిస్తున్న హెచ్ఎం అప్పారావు

కశింకోట, ఫిబ్రవరి 3: పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో డీపీఎన్ జడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎంఆర్‌వీ అప్పారావు శనివారం రాత్రి ఇంటింటికి వెళ్లి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. రాత్రి సమయంలో ఏ విధంగా చదువుతున్నారో తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తగిన సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పీవీ ప్రభాకర్, ఆచంట రవి, బి. అప్పారావు, ఎన్‌జేవీ ప్రసాద్, విద్యా కమిటీ చైర్మన్ మేరీ సుజాత పాల్గొన్నారు.

జగన్ పాలనలో దళితులకు అన్యాయం : అనిత


సమావేశంలో మాట్లాడుతున్న అనిత

నక్కపల్లి, ఫిబ్రవరి 3: వైసీపీ పాలనలో దళితులకు అన్యాయం జరిగిందని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. శనివారం సాయంత్రం తన నివాసం వద్ద నియోజకవర్గంలోని దళిత సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. టీడీపీ పాలనలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను కేటాయిస్తే, జగన్ సర్కారు దళితుల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని విమర్శించారు. మరో మూడు నెలల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పడుతుందని, ఆ తరువాత దళిత సంక్షేమానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. నియోజకవర్గంలో దళితులకు ప్రత్యేక కాలనీ, అంబేడ్కర్ పార్కు, స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటు, నిరుద్యోగ దళిత యువతకు ఉపాధి, ఉద్యోగవకాశాలకు తాను అధిక ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు.

రెండో రోజూ యూటీఎఫ్ రిలే దీక్షలు


రిలే దీక్షలో కూర్చున్న ఉపాధ్యాయులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 3 : సమస్యలు పరిష్కారం కోరుతూ నెహ్రూచౌక్ వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు రెండో రోజు శనివారం కొనసాగాయి. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి గొంది చినబ్బాయి మాట్లాడుతూ ఉద్యోగ,ఉపాధ్యాయులకు ప్రభుత్వం రూ.18వేల 9 కోట్లు బకాయిపడిందని, ఇది చాలా అన్యాయమన్నారు. ఈ పరిస్థితి చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా దివాళా తీసిందా అని ఆయన ప్రశ్నించారు. ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు నెల్లి సుబ్బారావు, జోగా రాజేష్, రమేష్‌రావు, శేషుకుమార్, జీఎస్ ప్రకాష్ పాల్గొన్నారు.

10న డైట్‌లో వైబ్రెంట్ డైట్-2024


పోస్టర్ ఆవిష్కరించిన దాడి రత్నాకర్

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 3 : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో వార్షికోత్సవంలో భాగంగా ఈనెల 10వ తేదీన వైబ్రెంట్ డైట్-2024 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ తెలిపారు. శనివారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసే ప్రయత్నంలో భాగంగా ప్రతి ఏటా వైబ్రెంట్ డైట్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. చదువులో అత్యధిక మార్కులు సాధించిన వారికి, ఉన్నతస్థాయిలో స్థిరపడిన పూర్వ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు సన్మానాలు ఉంటాయన్నారు. ప్రముఖ గాయని సాహితీ చాగంటిచే ప్రదర్శనతోపాటు ప్రముఖ రాక్ బ్యాండ్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. వైకుంఠరావు పాల్గొన్నారు.

'వైన్‌షాపుల్లో చోరీలు జరగకుండా చూడాలి'

కశింకోట, ఫిబ్రవరి 3 : మద్యం దుకాణాల్లో దొంగతనాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సీఐ కె.వినోద్‌బాబు సూచించారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో మద్యం దుకాణాల సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డులతో ఆయన సమావేశమయ్యారు. మద్యం దుకాణాల వద్ద సెక్యూరిటీ గార్డులు తప్పనిసరిగా ఉండాలన్నారు. సూపర్‌వైజర్లంతా ఒక వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసుకొని ఏమైనా ఇబ్బందులు ఎదురైతే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎటువంటి వారినైనా సహించేది లేదని హెచ్చరించారు.

'పేదవాడి సొంతింటి కల సాకారం'

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 3 : పేదవాడి సొంతింటి కల సాకారమయ్యిందని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. మండలంలోని పెంటకోటలో శనివారం ఆయన 100 మంది జగనన్న కాలనీ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల స్థలాల పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ చంద్రశేఖర్, కార్యదర్శి సత్యనారాయణ, వీఆర్వో రాజేష్, వైసీపీ నాయకులు చేపల తాతాజీ పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన వారు ఓటు నమోదు చేసుకోవాలి

కశింకోట, ఫిబ్రవరి 3: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఎల్. మధుసుదన కోరారు. అనకాపల్లి నియోజకవర్గంలో ఇప్పటివరకు 2,11,072 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వాటిలో పురుషులు 1,01,818, స్త్రీలు 1,09,249 మంది, ఇతరులు ఐదుగురు ఉన్నారని తెలిపారు. కశింకోటల మండలం 55,707 మంది ఓటర్లుగా నమోదయ్యారన్నారు. వాటిలో పురుషులు 26,786 మంది, స్త్రీలు 28,920 మంది, ఒకరు మాత్రమే ఇతరులుగా నమోదయ్యారని తెలిపారు. మండలంలోని మొత్తం 71 పోలింగ్ బూతులు ఉన్నాయని చెప్పారు.

శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర పరీక్షలు

కశింకోట, ఫిబ్రవరి 3: స్థానిక రిటైర్డు ఉద్యోగుల సంఘం, విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఇక్కడ ఉచిత నేత్ర వైద్యశిబిరం జరిగింది. ఈ సందర్భంగా వైద్యులు ఊర్వశి సింగ్, దేశ్ముఖ సమృద్ధి 92 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 14 మందికి శస్త్ర చికిత్సలు అవసరం కాగా.. 16 మందికి కళ్లద్దాలకు సిఫారసు చేశారు. ఈశిబిరంలో రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పాము సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కె.గోపాలరావు, కార్యదర్శి నంబా రమణ, కె.కామేశ్వరరావు, కరణం సూర్య ప్రకాశరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

తాగు నీరు వృథా అధికారులకు పట్టదా?


పైపునకు రంధ్రం పడడంతో వృథా అవుతున్న తాగునీరు

పరవాడ, ఫిబ్రవరి 3 : స్థానిక మండలపరిషత్ జంక్షన్‌లో ఏపీఐఐసీకి చెందిన మంచినీటి పైపులైన్‌కు రంధ్రం పడడంతో తాగునీరు వృథా అవుతున్నది. పరవాడ ఫార్మాసిటీ నుంచి అచ్యుతాపురం సెజ్‌లో పరిశ్రమలకు తాగునీటి అవసరాల నిమిత్తం ఏపీఐఐసీ అధికారులు ఎనిమిదేళ్ల క్రితం భూగర్భ మంచి నీటి పైపులైన్‌లను ఏర్పాటు చేశారు. ఈ పైపులైన్‌కు మండల పరిషత్ జంక్షన్‌లో రంధ్రం ఏర్పడడంతో 50 రోజులుగా నీరు రహదారిపై ప్రవహిస్తూ సమీపంలోని గెడ్డలోకి కలుస్తున్నది. దీని కారణంగా రహదారి గుండా రాకపోకలు సాగించే ప్రయాణికులు, స్థానికులు అవస్థలు పడుతున్నారు. పైపులైన్ లీకేజ్ అవుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. తాగునీటి వృథాను అరికట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పాడి రైతుల సంక్షేమమే హెరిటేజ్ డెయిరీ ధ్యేయం

రాంబిల్లి, ఫిబ్రవరి 3 : పాడిరైతుల సంక్షేమమే ధ్యేయంగా హెరిటేజ్ డెయిరీ పనిచేస్తుందని డెయిరీ రీజనల్ మేనేజర్ పి.నాగఅప్పారావు అన్నారు. శనివారం మర్రిపాలెంలో హెరిటేజ్ డెయిరీ అందిస్తున్న సదుపాయాలపై పాడిరైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పాడిరైతులకు పశు దాణా, మందులను అందజేశారు. డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు, వెటర్నరీ అసిస్టెంట్ సీహెచ్.రాము పాల్గొన్నారు.

'ధర్మ పరిరక్షణ బాధ్యత అందరిది'

రాంబిల్లి, ఫిబ్రవరి 3 : సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని సమరసతా సేవా ఫౌండేషన్ ఉత్తరాంధ్ర జోనల్ ధర్మ ప్రచారకులు ఆడారి గంగాధర్ అన్నారు. మండలంలోని కొత్తపేట భావనాఋషి ఆలయంలో శనివారం జరిగిన ఫౌండేషన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో భజనలు, నగర సంకీర్తన, సామూహిక హారతి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సమరసతా సేవా ఫౌండేషన్ ప్రతినిధులు కొల్లి అప్పారావు, సూరాడ నూకరాజు, చింతకాయల జగన్‌కుమార్, వై.సత్యనారాయణ పాల్గొన్నారు.

భూముల రీ సర్వేలో పేర్లు గల్లంతు

- కశిమి రెవెన్యూ పరిధిలోని పలువురు రైతులు ఆరోపణ
- సాగులో లేనివారి పేర్లు ఆన్‌లైన్‌లో ఉన్నాయని ఆవేదన
- అధికారులు సర్వే జరిపి న్యాయం చేయాలని వేడుకోలు


ఆన్‌లైన్‌లో పేర్లు తొలగించారంటూ వాపోతున్న కశిమి గ్రామ రైతులు

గొలుగొండ, ఫిబ్రవరి 3 : భూముల రీ సర్వేలో సాగులో ఉన్న తమ పేర్లు గల్లంతయ్యాయని పలువురు రైతులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలోని కశిమి రెవెన్యూ గ్రామంలో ఆరునెలల క్రితం సుమారు 720 ఎకరాల భూములకు రీ సర్వే చేశారు. అయితే కశిమి గ్రామానికి చెందిన రైతులు పూర్వం నుంచి ఆయా భూముల్లో సాగు చేస్తున్నారు. రీ సర్వే నిర్వహించకముందు 29 మందికి చెందిన జిరాయితీ, డి.పట్టా భూముల వివరాలు ఆన్‌లైన్‌లో ఉన్నాయని వారు తెలిపారు. రీ సర్వే చేపట్టిన రెండు నెలల అనంతరం తమ పేర్లు ఆన్‌లైన్‌లో తొలగిపోయాయని వాపోతున్నారు. మంగళగిరి శ్రీనివాసరావు అనే రైతు మాట్లాడుతూ కశిమి రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 44-1లో 5.42 ఎకాల భూమి తన తండ్రి నుంచి తనకు సక్రమించిందని వివరించారు. రీ సర్వే అనంతరం ఆన్‌లైన్‌లో తొలగించారని ఆవేదన వ్యక్తం చేశాడు. అలాగే, అదే రెవెన్యూలో గల గొంప నానాజీ, చీమల రాజ్యలక్ష్మి, ఈదల కల్యాణం, అడిగర్ల అప్పలనాయుడు, ఈదల అప్పలనాయుడు, అల్లం గుర్రయ్య, ఈదల బుచ్చమ్మ, గొంప రాజులతో పాటు 21 పేర్లకు సంబంధించి సుమారు 150 ఎకరాల భూముల వివరాలు ఆన్‌లైన్‌లో లేకుండా పోయాయని చెపుతున్నారు. ఈ భూములతో ఎటువంటి సంబంధం లేనివారి పేర్లు ఆన్‌లైన్‌లో రీ సర్వే అనంతరం నమోదయ్యాయని వారు ఆరోపిస్తున్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్, గొలుగొండ తహసీల్దార్‌కు విన్నవించినా ఫలితం లేకపోతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాల్సిందిగా కోరుతున్నారు. దీనిపై భూముల రీ సర్వే డీటీ బి.బాలరాజుదొరను వివరణ కోరగా, కశిమి రెవెన్యూలో భూముల రీసర్వే అనంతరం పలువురు సాగుదారుల పేర్లు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదంటూ తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ అంశాన్ని ఉన్నతాధికారులకు తెలిపామన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి రెవెన్యూ రికార్డుల ఆధారంగా వివరాలు ఆన్‌లైన్ చేస్తామని చెప్పారు.

'జనసేన, టీడీపీ విజయమే లక్ష్యం కావాలి'


సమావేశంలో మాట్లాడుతున్న సూర్యచంద్ర

నర్సీపట్నం అర్బన్, ఫిబ్రవరి 3 : క్షేత్రస్థాయి నుంచి జనసేనను బలోపేతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీర సూర్యచంద్ర సూచించారు. నర్సీపట్నంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ కూటమి విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో నష్టపోయిందన్నారు. దీనిని ప్రజలకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు సామిరెడ్డి కిరణ్‌కుమార్, సేనాపతి నాయుడు, బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడు

- పోలీసులకు ఓ తల్లి ఫిర్యాదు
- కూతురికి న్యాయం చేయాలని వేడుకోలు

నర్సీపట్నం, ఫిబ్రవరి 3 : నాతవరం మండలం వెన్నలపాలెం గ్రామానికి చెందిన వాసురెడ్డి శేఖర్ తన కూతుర్ని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి, మోసం చేయడంతో పాటు ఆమెకు విషయం తాగించి చంపాలని చూశాడని రుత్తల అమ్మాజీ అనే మహిళ శనివారం ఫిర్యాదు చేసినట్టు పట్టణ ఎస్ఐ సుధాకరరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన అందించిన వివరాలివి. నర్సీపట్నం శారదానగర్‌కు చెందిన రుత్తల రత్నమాధురి, వెన్నలపాలేనికి చెందిన వాసురెడ్డి శేఖర్ గత ఆరేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరూ హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేసేవారు. తొలుత పెళ్లి చేసుకుంటానని చెప్పిన శేఖర్ ఆ తర్వాత నిరాకరించాడు. ఇదిలావుండగా, జనవరి 27 రత్నమాధురి గుడికి వెళ్లి వస్తానని బయటకు వెళ్లి ఇంటికి రాలేదు. ఎంతకీ రాకపోయేసరికి తన కుమార్తెకు ఫోన్ చేస్తే ఫ్రెండ్ వద్ద ఉన్నానని చెప్పిందని తల్లి ఆ ఫిర్యాదులో పేర్కొంది. అదే రోజు అర్ధరాత్రి రెండు గంటలకు శేఖర్ తన కుమార్తెను ఇంటి వద్ద దింపి వెళ్లాడని ఆమె వివరించింది. ఎక్కడకు వెళ్లారని తన కుమార్తెను అడితే శేఖర్ వైజాగ్ తీసుకు వెళ్లాడని చెప్పిందని తెలిపింది. ఆ మరుసటి రోజు వాంతులు అవుతుంటే ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించామని, పరిస్థితి విషమించడంతో విశాఖపట్నం ఆస్పత్రికి తరలించామని ఆ ఫిర్యాదులో పేర్కొన్నట్టు ఎస్ఐ తెలిపారు. తన కూతుర్ని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని ఆరోపించింది. కుమార్తెను వదించుకోవాలన్న ఉద్దేశంతో విషయం తాగించి చంపాలని చూశాడని ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై న్యాయం చేయాలని కోరింది.

'ఎస్సీ వర్గీకరణ జరిగితేనే మాదిగలకు న్యాయం'



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లిబాబు

రోలుగుంట, ఫిబ్రవరి 3 : ఎస్సీ వర్గీకరణ జరిగితేనే మాదిగలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యలక మల్లిబాబు పేర్కొన్నారు. రోలుగుంటలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జిల్లా సమీక్ష సమావేశంలో మాట్లాడారు. మంద కృష్ణమాదిగ ఉద్యమ ఫలితంగా త్వరలోనే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణకు రాష్ట్రం తరఫున అఖిల పక్షాన్ని డిల్లీకి పంపించాల్సిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళితుల్లోని అన్ని కులాలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి కొల్లి చిన్న అప్పారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కట్టుమూరి మంగరాజు, ఎత్తుల అప్పారావు, ఆరుగొళ్ల రాజుబాబు, జిల్లా మహిళా అధ్యక్షురాలు చింతాడ మేరీ, తొమ్మండ్ర అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలలు కష్టపడితే రాష్ట్రానికి మంచి రోజులు

- సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగండి
- జగన్ ఐదేళ్ల పాలనలో అన్నిరంగాల్లో వెనుకబడిన ఆంధ్ర
- చంద్రబాబు రా.. కదలి రా.. సభను విజయవంతం చేయండి
- టీడీపీ శ్రేణులకు మాజీ మంత్రి అయ్యన్న పిలుపు


నర్సీపట్నంలో మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు, చిత్రంలో విశాఖ తూర్పు ఎమ్మెల్యే రామకృష్ణబాబు తదితరులు

నర్సీపట్నం, ఫిబ్రవరి 3 : రా.. కదలి రా.. పేరిట టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాడుగుల నియోజకవర్గంలో సోమవారం నిర్వహించనున్న బహిరంగ సభను అంతా విజయవంతం చేయాలని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. శనివారం నర్సీపట్నంలోని ఆయన నివాసంలో పార్టీ ముఖ్య నేత లతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.11 లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు. చేసిన అప్పులకు సంవత్సరానికి రూ.80వేల కోట్లు వడ్డీలు కడుతున్నారన్నారు. వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని ఎద్దేవా చేశారు. మరో రెండు నెలల్లో ఎన్నికలు జరగనున్నందున నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేస్తే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. టీడీపీ- జనసేన ప్రభుత్వం ఏర్పాటు తథ్యమని తనకు పూర్తి విశ్వాసం ఉందని స్పష్టం చేశారు. చంద్రబాబు సభకు నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున తరలి రావాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో విశాఖ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు,


పెదనందిపల్లి సమావేశంలో చిరంజీవరావు, పీవీజీ, గవిరెడ్డి, పైలా తదితరులు

నియోజకవర్గ పరిశీలకులు ఎంవీవీ ప్రసాద్, మురళీకృష్ణరాజు, గొల్లపూడి పెద్దిరాజు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన సూర్య చంద్ర తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీ ప్రభంజనానికి గొండుపాలెం నాంది కావాలి'

దేవరాపల్లి : జగన్ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో నష్టపోయిందని ఎమ్మెల్సీ చిరంజీవరావు అన్నారు. పెదనందిపల్లిలో శనివారం ఏర్పాటైన పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడారు. కె.కోటపాడు మండలం గొండుపాలెం జరగనున్న చంద్రబాబు సభను అంతా విజయంతం చేయాల్సిందిగా కోరారు. పార్టీ పరిశీలకుడు కర్రోతు నరసింగరావు మాట్లాడుతూ టీడీపీ ప్రభంజనానికి కె.కోటపాడు మండలంలో జరగనున్న సభ నాంది కావాలన్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు సభ విజయవంతం అందరి బాధ్యతగా పేర్కొన్నారు. నాయకులు చెరకాన సూర్యనారాయణ, పోతల పాత్రునాయుడు, చిటిమిరెడ్డి సూర్యనారాయణ, పోతల రమణమ్మ, పెద్దాడ వెంకటరమణ, పూడి సత్యారావు, జనసేన పార్టీ నాయకులు జి.రామ్మూర్తినాయుడు, శ్రీరామ్‌లతో పాటు మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, కార్యర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల కోసమే డీఎస్సీ నోటిఫికేషన్

- ఇది నిరుద్యోగులను మోసం చేయడమే : తాతయ్యబాబు


సమావేశంలో మాట్లాడుతున్న తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 3 : ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే సీఎం జగన్‌రెడ్డి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్టు నిరుద్యోగులను దగా చేస్తున్నారని టీడీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు ఆరోపించారు. శనివారం వడ్డాదిలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 50,892 ఉపాధ్యాయ పోస్టుల ఖాళీగా ఉండగా, గత నాలుగున్నరేళ్ల కాలయాపన చేసిన ముఖ్యమంత్రి, ఎన్నికలకు రెండు నెలలు మాత్రమే గడువు ఉండడంతో 6100 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేస్తుండడం దారుణమన్నారు. టీడీపీ- జనసేన ప్రభుత్వం ఏర్పడగానే టీచర్ పోస్టులు భర్తీ చేస్తారని, అప్రెంటిస్‌షిప్ విధానాన్ని రద్దు చేసి పూర్తి పేస్కేల్ అమలు చేస్తారన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో నష్టపోయిందన్నారు. టీడీపీ హయాంలో ఆంధ్ర రాష్ట్రాన్ని పెట్టుబడులకు హబ్‌గా మార్చితే, జగన్‌రెడ్డి పాలనలో గంజాయికి హబ్ మార్చారని ఎద్దేవా చేశారు. కొందరు పోలీసులే గంజాయి స్మగర్లుగా మారారంటే ఇంతకన్నా దౌర్భాగ్యం ఏం ఉంటుందని ప్రశ్నించారు. వీటన్నింటినీ గమనిస్తున్న రాష్ట్ర ప్రజానీకం రానున్న ఎన్నికల్లో ఓటుతో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

'అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ పాలన'


కోనాంలో సచివాలయ భవనం ప్రారంభోత్సవంలో బూడి

చీడికాడ, ఫిబ్రవరి 3 : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్టు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. మండలంలోని చీడిపల్లి నుంచి అర్జునగిరి, కాటా నుంచి పెదగోగాడ రోడ్డు, వరహాపురం నుంచి పెదగో గాడ, ఎల్‌బీపట్నం నుంచి కేఎల్‌బీ పట్నం వరకూ నిర్మించిన రోడ్లతో పాటు ఐదు గ్రామ సచివాలయ, ఐదు ఆర్‌బీకే, నాలుగు హెల్త్ సెంటర్ల భవనాలను శనివారం ప్రారంభించి మాట్లాడారు. ఎంపీపీ కురచా జయమ్మ, జడ్పీటీసీ లాలం శారదా వరలక్ష్మి, సర్పంచ్‌లు కసిరెడ్డి సూర్యనారాయణ, బి.రమాదేవి, గొల్లవిల్లి చిన్నమ్మలు, చలుగు ఈశ్వరమ్మ, కన్నూరు సత్యవతి, సీరంరెడ్డి లక్ష్మితో పాటు వైసీపీ నాయకులు గొల్లవిల్లి రాజబాబు, స్వామి నాయుడు, సుంకరి శ్రీనివా సరావు, మజ్జి దేవానందం, పరవాడ మహేష్ పాల్గొన్నారు.


కన్నూరిపాలెంలో రహదారి ప్రారంభోత్సవంలో ఎంపీ సత్యవతి, విప్ ధర్మశ్రీ

చోడవరం : అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నట్టు అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి తెలిపారు. శనివారం మండలంలోని కన్నంపాలెం, జన్నవరం, నరసయ్యపేటలలో సచివాలయాలు, హెల్త్‌సెంటర్ భవనాలతో పాటు, ఇంటింటికీ కుళాయిలను విప్ ధర్మశ్రీతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, పీఆర్ డీఈ ప్రసాదరావు, వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు, సీనియర్ నాయకులు శరగడం సిమ్మినాయుడు, వైసీపీ మండల అధ్యక్షుడు డీవీఆర్ తదితరులు పాల్గొన్నారు.

'హైడ్రో పవర్ ప్లాంటు పనులు నిలిపివేయాలి'


ప్లాంటు నిర్మించాల్సి ప్రదేశంలో సీపీఐ నాయకులు

దేవరాపల్లి, ఫిబ్రవరి 3 : మండలంలోని చింతలపూడి పంచాయతీ బల్లిపురం నుంచి వేపాడ మండలం వీలుపర్తి వరకు తలపెట్టిన హైడ్రోపవర్ ప్లాంటు పనులను వెంటనే నిలుపుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేటి వెంకటరమణ డిమాండ్ చేశారు. ఆ పార్టీ నాయకులు శనివారం సదరు ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదానీ కంపెనీ చేపట్టనున్న పవర్ ప్లాంటు నిర్మాణం వల్ల శారదానది, సమీపంలో ఉన్న గిరిజన ప్రాంతాలకు ముప్పు వాటిల్లనుందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే పనులను నిలుపుదల చేయాలన్నారు. సీపీఐ జిల్లా సమితి సభ్యులు వేమల కన్నబాబు, గొర్లె దేముడుబాబు, మండల కార్యదర్శి గరికిన రాజు, వియ్యపురాజు, నూకరాజు పాల్గొన్నారు.

నువ్వు పంటలో తెగుళ్ల నివారణకు సూచనలు


నువ్వు పంట సాగుపై సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

దేవరాపల్లి, ఫిబ్రవరి 3 : వేచలం గ్రామంలో కొండెంపూడి శాస్త్రవేత్తలు డాక్టర్ రాజకుమార్, సౌజన్య, బాబు, మండల వ్యవసాయాధికారిణి ఎల్.వై.కాంతమ్మ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా నువ్వు పంట ఆకుపై తెగుళ్లను గుర్తించారు. వీటి నివారణకు కార్బెండిజమ్, మెన్‌కోజెబ్ మందును రెండు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. అనంతరం అక్కడి రైతులతో సమావేశమై పంటల సాగులో మెలకువలను వివరించారు.

ఘనంగా లయన్స్ క్లబ్ సేవా మహోత్సవం

- 170 మందికి సైకిళ్లు, కట్టుమిషన్లు, గ్రైండర్లు పంపిణీ


కుట్టు మిషన్ల పంపిణీలో ఇంటర్నేషనల్ లయన్స్ పాస్ట్ ప్రెసిడెంట్ ఫ్రాంక్ మోర్

నర్సీపట్నం, ఫిబ్రవరి 3 : లయన్స్ క్లబ్ సేవా మహోత్సవాన్ని శనివారం ఇక్కడ ఘనంగా నిర్వహించారు. బలిఘట్టంలో రూ.కోటితో నిర్మించిన రావు సాహెబ్ దస్త్రాల రామారావు పంతులు లయన్స్‌కమ్యూనిటీ భవనాన్ని ఇంటర్నేషనల్ లయన్స్ పాస్ట్ ప్రెసిడెంట్ జె.ఫ్రాంక్ మోర్ ప్రారంభించారు. అనంతరం వంద మంది విద్యార్థులకు సైకిళ్లు, బ్యాగులు, 50మంది మహిళలకు కుట్టు మి షన్లు, 20 మందికి గ్రైండర్లు, 30 మంది చెవిటి మిషన్లు ఆయన పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లయన్స్ క్లబ్ నిర్మించిన గ్రంథాలయాన్ని సందర్శించి, కళా శాల ఆవరణలో మొక్కలు నాటారు. 150 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. చెట్టుపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ అధికారి గోపాలరావు నిర్మించిన వేదికను ఆయన ప్రారంభించారు. అనంతరం వంద మందికి ప్రాథమిక క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వి.వి జయ్ కుమార్ రాజు, డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ అధికార గోపాలరావు, దస్త్రాల రాఘవేంద్రరావు, చింతకాయల సన్యాసిపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట తహసీల్దార్‌గా రవి చంద్ర



రోలుగుంట, ఫిబ్రవరి 3 : ఇక్కడి తహసీల్దార్‌గా రవి చంద్ర శనివారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మండలం నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు విచ్చేశారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న కె.వరహాలు మన్యం జిల్లా పార్వతీపురానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కొత్త తహసీల్దార్‌కు సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు.

16న అడవి రాజులబాబు పండుగ


ఎర్రవరంలో గల అడవి రాజులబాబు గుడి

గొలుగొండ, ఫిబ్రవరి 3 : మండలంలోని ఎర్రవరం, చీడిగుమ్మల, పాకలపాడు, కొత్తఎల్లవరం, పుత్తడిగైరంపేట, పోలవరం గ్రామాల్లో ఈనెల 16వ తేదీన అడవి రాజులబాబు పండుగ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపడుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆరోజు ఉదయం నుంచి రాత్రి వరకు విశేష పూజలు ఉంటాయన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా కోరారు.

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం

చీడికాడ, ఫిబ్రవరి 3 : శిరిజాం గ్రామంలో ఆంజనేయ స్వామి తీర్థం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించారు. విజేతలకు గ్రామ పెద్దలతో పాటు నిర్వాహకులు నగదు బహుమతులను అందజేసి సత్కరించారు.

బంగారుమెట్టలో ఈవీఎంలపై అవగాహన


ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 3 : బంగారుమెట్టలో ఈవీఎంలపై శనివారం అవగాహన కల్పించారు. ఓటును ఏవిధంగా వినియోగించుకోవాలన్న అంశంతో పాటు ఓటు ప్రాధాన్యతను రెవెన్యూ అధికారులు వివరించారు. అనంతరం పలువురి సందేహాలను నివృత్తి చేశారు.

యోగా కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు

చోడవరం, ఫిబ్రవరి 3 : కేంద్ర ప్రభుత్వ ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో యోగా గురువుగా, యోగా ఉపాధ్యాయుడిగా రాణించాలనుకునే యువతీయువకులు స్థానిక పతంజలి యోగా కేంద్రానికి దరఖాస్తులు చేసుకోవాలని యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పుల్లేటి సతీష్ శనివారం తెలిపారు. ఆయుష్ విభాగం కేంద్ర సర్టిఫికెట్ బోర్డు ఆధ్వర్యంలో యోగా కోర్సులకు శిక్షణ ఇవ్వడంతో పాటు, వారికి సర్టిఫికెట్ జారీ చేస్తారన్నారు. ఈ బోర్డు ద్వారా జారీ చేసిన సర్టిఫికెట్లతో ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలలతో పాటు, అంతర్జాతీయ స్కూళ్లలో యోగా ఉపాధ్యాయునిగా చేరడానికి అవకాశం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 92912 76900 నంబరులో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

నాలుగు కిలోల గంజాయితో ముగ్గురి అరెస్ట్

కృష్ణాదేవి పేట, ఫిబ్రవరి 3 : నాలుగు కిలోల గంజాయితో ముగ్గురు యువకులను అరెస్టు చేసినట్టు కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు. ఇక్కడి పీహెచ్‌సీ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టు వద్ద శనివారం గుంటూరు జిల్లాకు చెందిన కార్తీక్, మోహన్, జ్యోతిబాబులు కాలినడకన బ్యాగులతో వెళుతుండగా తనిఖీలు చేశామన్నారు. వీరివద్ద నాలుగు కిలోల గంజాయి ప్యాకెట్లను గుర్తించడంతో పాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కోర్టుకు తరలించినట్టు చెప్పారు.

'లక్ష్యాలకు అనుగుణంగా ఉపాధి పనులు'


ప్రజా వేదికలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజారాం

మాడుగుల, ఫిబ్రవరి 3 : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి శనివారం ప్రజా వేదిక నిర్వహించారు. తొలుత ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి, వలసల నివారణకు ఉపాధి పనులు దోహదపడతాయన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఈ పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం మండలంలోని 29 పంచాయతీల్లో చేపట్టిన పనులు, అందుకు సంబంధించి ఖర్చులు తదితరాలను పీడీ సందీప్ వివరించారు. సామాజిక తనిఖీల సందర్భంగా బృందాల సభ్యులు గుర్తించిన పనుల తీరుపై ఆరా తీశారు. ఎంపీడీవో ఆర్.కాళీ ప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు రామదర్శజ, సర్పంచ్ యడ్ల కళావతి, ఈవోపీఆర్‌డీ మీనాకుమారి, ఏపీడీలు రోజారాణి, శ్రీనివాసరావు, విజిలెన్స్ అధికారిణి సీహెచ్.నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు,
9985411639
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబరుకు సంప్రదించగలరు.
9985411029

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ప్రాంతీయ కార్యాలయం: విజయనగరం
బంగారు ఆభరణాల అప్రైజర్ ఎంపానల్మెంట్ ప్రకటన
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, విజయనగరం ప్రాంతీయ కార్యాలయం వారు నూతన గోల్డ్ అప్రైజర్/ప్రొఫెషనల్స్ కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేయాలని భావిస్తున్నారు. బంగారు ఆభరణాల నాణ్యత మూల్యాంకన ప్రక్రియలో సహాయం చేయుటకు దిగువ తెలిపిన శాఖల వద్ద వారు పని చేయవలసి ఉంటుంది. అర్హత, దరఖాస్తు మరియు పూర్తి వివరాల కొరకు మా బ్యాంకు వెబ్‌సైట్ www.unionbankofindia.com ను లేదా మా సమీప యూనియన్ బ్యాంక్ శాఖను సంప్రదించగలరు.
ప్రకటణ తేదీ:04-02-2024, ధరఖాస్తు ఆఖరి తేదీ: 18-02-2024
అప్రైజర్ కావాల్సిన శాఖలు:
శ్రీరంగరాజపురం, విజయనగరము, పెదతాడివాడ, చోడవరం, అంకుపాలెం, అనకాపల్లి పూల్ అప్రైజర్స్ (విజయనగరం ప్రాంతీయ కార్యాలయం కొరకు) మరిన్ని వివరములు కొరకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం, విజయనగరం సెల్: 9652578210 నందు సంప్రదించవచ్చును.
రీజనల్ హెడ్

కొలిక్కిరాని వలంటీర్ హరినాథ్ హత్య కేసు

- మరి కొంతమందిని పోలీసులు విచారణ
- పింఛన్ డబ్బులు కనిపించకపోవడంతో ఎస్ఐకు ఎంపీడీవో ఫిర్యాదు


వలంటీర్ హరినాథ్ (ఫైల్)

మాకవరపాలెం, ఫిబ్రవరి 3: మండలంలోని లచ్చన్నపాలెంలో గ్రామ వలంటీర్ హరినాథ్ హత్య కేసు మూడో రోజు కూడా కొలిక్కి రాలేదు. ఈనెల ఒకటో తేదీన వలంటీర్ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ కేసు అనేక మలుపులు తిరుగుతుండడంతో పోలీసులు మరింత లోతుగా విచారణ జరుపుతున్నారు. హరినాథ్ ఫోన్ కాల్స్ ఆధారంగా లచ్చన్నపాలెం గ్రామానికి చెందిన పలువుర్ని స్టేషన్‌కు పిలిచి విచారిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం కూడా పంచాయతీ కార్యదర్శిని, గ్రామానికి చెందిన ముగ్గురు యువకులతో పాటు ఒక ఉపాధ్యాయుడు, మరో మహిళను విచారించారు. అలాగే బూరుగుపాలెం గ్రామానికి చెందిన ఒక మహిళను స్టేషన్‌కు రప్పించి ఆరా తీస్తున్నారు. వీరితో పాటు గిడుతూరు నుంచి ఒకరు, రోలుగుంట మండలం కొత్తూరు గ్రామానికి చెందిన ఒక యువకుడ్ని పోలీసు స్టేషన్‌కు రప్పించారు. ఏదీ ఏమైనప్పటికీ రెండు రోజుల్లో కేసు కొలిక్కి వస్తుందని పోలీసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఇదిలావుంటే, హరినాథ్ తీసుకు వెళ్లిన పింఛను డబ్బులు కనిపించడం లేదని ఎంపీడీవో సీతామహాలక్ష్మి శనివారం ఎస్ఐ రామకృష్ణారావు ఫిర్యాదు చేశారు. పింఛన్ల పంపిణీకి సంబంధించి జనవరి 31వ తేదీన సచివాలయం నుంచి వలంటీర్ హరినాథ్ రూ.లక్షా ఆరు వేలను తీసుకొని అదే రోజు ఇంట్లో ఉంచి బయటకు వెళ్లాడు. ఆ మర్నాడు గ్రామ శివారు పొలాల్లో అతడు శవమైన కనిపించాడు. అయితే అతని తల్లి పింఛను డబ్బులు ఇంట్లో పెట్టాడని ముందు రోజు అధికారులకు తెలిపింది. రెండో తేదీన డబ్బులు ఇంట్లో కనిపించడం లేదని చెప్పడంతో ఎంపీడీవో పోలీస్ స్టేషన్‌తో పాటు డీఆర్‌డీఏ అధికారులకు ఫిర్యాదు చేశారు.

తహసీల్దార్ హత్యపై రెవెన్యూ ఉద్యోగుల నిరసన

- నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు
- దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్


నల్ల బ్యాడ్జి ధరించి విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్, డీటీ అరుణ్‌చంద్ర

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 3 : విశాఖ పట్టణంలోని కొమ్మాదిలో చినగదిలి రూరల్ తహసీల్దార్ రమణయ్యను దారుణంగా హత్య చేయడాన్ని ఇక్కడి రెవెన్యూ ఉద్యోగులు తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు నిరసనగా శనివారం తహసీల్దార్ కె.శ్రీకాంత్, హెచ్‌డీటీ అరుణ్‌చంద్ర, కార్యాలయం ఉద్యోగులు, వీఆర్వోలు నల్లబ్యాడ్జీలు ధరించి విధులను నిర్వహించారు. హంతకులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని పోలీసు అధికారులను వారు డిమాండ్ చేశారు.